
విద్యుదుత్పాదన కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సిద్ధరామయ్య

గ్యాస్ ఆధారంగా విద్యుదుత్పాదన

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రంలో మొదటి గ్యాస్ ఆధారిత విద్యుదుత్పాదన కేంద్రాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం యలహంకలో ప్రారంభించారు. రాష్ట్ర ఆర్థిక, సామాజిక ప్రగతికి విద్యుత్తు ఉత్పాదనతో పాటు, వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధితోనే స్థూల జాతీయోత్పత్తి పెరుగుతుందని వివరించారు. గ్యాసు ఆధారిత విద్యుదుత్పాదనలో 370 మెగావాట్ల సాధన రాష్ట్రంలో ఇదే మొదటిదని తెలిపారు. కర్ణాటక ఉత్పత్తి చూసి రూ.1500 కోట్ల విలువైన విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు విక్రయించినట్లు చెప్పారు. గత ఏడాది వర్షం లేక, కరవు ఉన్నప్పటికీ, విద్యుత్తుకు కొరత రాకుండా చూశామని చెప్పారు. వచ్చే ఆర్థికలో 60 వేల మెగావాట్ల ఉత్పాదన లక్ష్యంతో ఇంధన శాఖ ముందడుగు వేసిందని చెప్పారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు శ్రమించిన కార్మికులందరికీ తలా రూ.5 వేల బోనస్‌ను ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు కేజే జార్జి, భైరతి సురేశ్, దినేశ్ గుండూరావు, ఎమ్మెల్యేలు అజయ్ సింగ్, విశ్వనాథ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


ముడా వివాదంతో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మధ్య ఇక సంబంధాలెలా..?

సంకట రామయ్య

- పిడుగులా 'ముడా' కేసు
- గవర్నర్ ఆదేశాలతో కష్టం
- న్యాయస్థానం తీరు శరాఘాతం
- సిద్ధుకు కాంగ్రెస్ సంఘీభావం

ఈనాడు, బెంగళూరు : కర్ణాటక రాజకీయాలు కుదుపునకు లోనయ్యాయి. మూడు నెలలుగా రాజకీయాల్లో.. నెల రోజులుగా న్యాయస్థానంలో కలకలం సృష్టించిన మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాల వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విచారించాలా.. వద్దా అనే అంశంపై ఎట్టకేలకు తీర్పు వెల్లడైంది. జాతీయ స్థాయిలో ఎంతో ఆసక్తికి గురి చేసిన ఈ వ్యవహారంలో రాష్ట్ర కార్యాంగం- రాజ్యాంగ వ్యవస్థల మధ్య అధికారాల పరిధి ఏమిటో స్పష్టమైంది. మరోవైపు ప్రజాప్రతినిధులకు రక్షణ కవచంగా ఉండని భావించే అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) 17ఏ నిబంధనపైనా మరోసారి చర్చించుకునే అవకాశాన్ని ఈ కేసు కల్పించింది. ఆగస్టు 16 నుంచి సర్కారును కుదిపేసిన గవర్నర్ ఆదేశానికి ఓ ముగింపు దొరికింది. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పేరొందిన సీనియర్, కొత్తతరం న్యాయవాదులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి ఈ కేసులో తమ వాదనలు వినిపించారు. భాజపా, కాంగ్రెస్‌ల మధ్య రాజకీయ పోరుకు అస్త్రంగా మారిన ఈ వ్యవహారం ఇంకా న్యాయస్థానాల్లో చర్చించేందుకు దారి చూపింది. ముఖ్యమంత్రి రాజీనామా కోసం విపక్షాలు, తమ నేత రాజీనామా చేయబోదని అధికార పక్షం ప్రకటించిన మరో వివాద రాజకీయ సమరానికి ముడా కేసు వేదిక కల్పించింది.


బెంగళూరులోని రాజ్‌భవన్‌కు గట్టి పోలీస్ భద్రత

ఊరట కొంతే..

హైకోర్టు వెల్లడించిన తీర్పు కాసేపు ఆందోళన కలిగించినా ముఖ్యమంత్రి సిద్ధు కాసేపటి తర్వాత తేరుకున్నారు. తీర్పు ప్రతిని ఆసాంతం చదివిన తర్వాత అందులోని అంశాలు తనకు విఘాతం కలిగించేవి కావని తీర్మానించుకున్నారు. న్యాయ, రాజకీయ వ్యవస్థల్లో తీవ్ర చర్చకు దారితీసిన అవినీతి నిరోధక చట్టం(పీసీ యాక్ట్) 17ఏలో ముఖ్యమంత్రి లేవనెత్తిన అభ్యంతరాలు గవర్నర్ అధికారాలకి అడ్డుకాదని కోర్టు తీర్మానించటం మినహా ముఖ్యమంత్రికి కాస్త ఊరట కలిగించింది. భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) 218, 19సీ చట్టాల ప్రకారం ముఖ్యమంత్రిని విచారించే అవకాశాలను కోర్టు తిరస్కరించింది. పైగా 17ఏ ప్రకారం ముడా అక్రమాలపై దర్యాప్తునకు మాత్రమే కోర్టు ఆదేశించటంతో ముఖ్యమంత్రిని ఉన్నపళంగా విచారించాలని సూచించలేదు. తీర్పు పరంగా ముఖ్యమంత్రిపై నేరుగా విచారణ అస్త్రం సంధించకపోయినా గవర్నర్ ఆదేశాలపై లేవనెత్తిన అభ్యంతరాలకు కోర్టు చెప్పిన సమాధానం కాంగ్రెస్ పార్టీ ఎత్తులను చిత్తు చేసినట్లే. అందులో సిద్ధు తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి, సీనియర్ న్యాయవాది రవివర్మ కుమార్, అడ్వొకేట్ జనరల్ శశికాంత్ శెట్టి వాదనల్లో.. గవర్నర్ ఆదేశాలు నిబంధనలపై సమగ్ర అధ్యయనం లేకుండా తయారవటం, మంత్రివర్గం ఇచ్చిన తీర్మానాన్ని నిర్లక్ష్యం చేయటం, ప్రైవేటు వ్యక్తుల ఫిర్యాదును పరిగణించి ప్రజాప్రతినిధిని విచారించాలనటం రాజకీయ ప్రభావిత చర్యలుగా అభివర్ణించారు. ఈ మూడు అభ్యంతరాలకు కోర్టు ఒక్కొక్కటిగా బదులిస్తూ.. మంత్రివర్గ తీర్మానాన్ని పరిగణించాలన్న నిబంధన గవర్నర్‌కు లేదు. పైగా ఇది ప్రత్యేక కేసుగా పరిగణించి గవర్నర్ తన సర్వాధికారాన్ని వినియోగించొచ్చు. ప్రైవేటు వ్యక్తుల ఫిర్యాదు సహేతుకంగా ఉందని భావిస్తే నేరుగా విచారణ ఆదేశాలు ఇచ్చే వీలుంది. కోర్టిచ్చిన ఈ వివరణ ప్రభుత్వ ఎత్తుగడలను నిర్వీర్యం చేసేవిగా మారినట్లు న్యాయరంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


ముఖ్యమంత్రి నివాసం ముంగిట భద్రత కట్టుదిట్టం

సిద్ధు దారెటు?

కోర్టు తీర్పు తర్వాత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అటు రాజకీయంగా, న్యాయపరంగా వేగంగా వ్యూహాలు పన్నాల్సి వస్తోంది. ఓ వైపు తన రాజీనామా కోసం డిమాండ్ చేస్తున్న విపక్షాలకు బదులివ్వాల్సి ఉండగా, మరోవైపు కోర్టు వెల్లడించిన తీర్పును న్యాయస్థానాల్లో సవాలు చేయాలి. తీర్పు తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోర్టు తీర్పును సమగ్రంగా చదివి, న్యాయ నిపుణులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. ఆలోగా.. ఆయనకు కొన్ని సమస్యలు ఎదురుకాక మానవు. తనపై టి.జె.అబ్రహం, స్నేహమయి కృష్ణ, ప్రదీప్ కుమార్ అనే వారు ప్రజా ప్రతినిధుల కోర్టులో వేసిన పిటిషన్ బుధవారం నుంచి విచారణకు రానుంది. గత ఆగస్టు 19న హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఈ కోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది. ఎలాగూ హైకోర్టు తీర్పు రావడంతో బుధవారం నుంచి అక్కడా విచారణ ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రిని విచారించాలన్న ఆదేశాలు జారీ చేయాల్సిన ఈ కోర్టు అందుకు ఆమోదిస్తే వెనువెంటనే ముఖ్యమంత్రిపై కేసు నమోదవుతుంది. ఆలోగా ముఖ్యమంత్రి హైకోర్టులో విస్తృత ధర్మాసనానికి పిటిషన్ వేయాల్సి ఉంది. ఆ కోర్టు ముఖ్యమంత్రి పిటిషన్‌ను స్వీకరించి విచారణ ప్రారంభిస్తే ముఖ్యమంత్రిపై విచారణ ఆదేశాలపై స్టే విధించే వీలుంది.

నేను తప్పుకోను..

ఈనాడు, బెంగళూరు : తీర్పు వెల్లడించిన తర్వాత తనపై వస్తున్న రాజీనామా డిమాండ్‌ను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా తప్పుబట్టారు. తనపై ప్రాథమిక తనిఖీకి మాత్రమే ఆదేశాలు వచ్చాయి. ఇంకా విచారణ ప్రారంభించలేదని ఆయన గుర్తు చేశారు. తన రాజీనామాను డిమాండ్ చేస్తున్న భాజపా తన మిత్రులైన జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి కుమారస్వామి నుంచి రాజీనామా తీసుకోవాలని గుర్తు చేశారు. తాను ఇలాంటి సవాళ్లను ఎన్నో ఎదుర్కొన్నానని బదులిచ్చారు. తనపై రాజకీయ కుట్రలు పన్నిన భాజపా, జేడీఎస్‌లకు బెదిరేది లేదని సవాలు చేశారు. ఏనాడూ నేరుగా అధికారాన్ని చేపట్టని భాజపా, జేడీఎస్.. 'ఆపరేషన్ కమల'కు ప్రయత్నించి విఫలమయ్యారని ధ్వజమెత్తారు. రాజ్‌భవన్ అధికారాలను దుర్వినియోగం చేసుకుని తనపై పగ సాధించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ గనుల లీజు కేసులో బెయిల్ పొందిన కుమారస్వామి కూడా తాను సిద్ధరామయ్య రాజీనామా కోసం డిమాండ్ చేయనని- తనపై వచ్చిన ఆరోపణల నుంచి బయటపడిన తర్వాత స్పందిస్తానని చెప్పటం గమనార్హం. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మేమంతా అండగా ఉన్నామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, సతీశ్ జార్కిహోళి, రామలింగారెడ్డి, సంతోశ్‌లాడ్ తదితరులు ప్రకటించారు. మరోవైపు కోర్టు తీర్పును గౌరవిస్తూ సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర, విపక్ష నేత ఆర్.అశోక్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఎంపీ జగదీశ్ శెట్టర్, ఎమ్మెల్సీ సి.టి.రవి తదితరులు డిమాండ్ చేశారు. రాజీనామా డిమాండ్ చేస్తూ భాజపా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమైంది.


కోర్టు తీర్పు అనంతరం విలేకరుల సమావేశంలో సిద్ధరామయ్య


ముడాలో అక్రమాలపై బెంగళూరులో ఆందోళనలో పాల్గొన్న భాజపా నాయకులు

ముడా కేసు నేపథ్యం..

దాదాపు మూడు దశాబ్దాల నేపథ్యం ఉన్న మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాలపై సామాజిక కార్యకర్త టి.జె.అబ్రహంతో పాటు ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ అనే వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ప్రకారం.. 1992లో ముడా సంస్థ భూముల సేకరణ కోసం ప్రకటన వేసి కెసరె గ్రామానికి చెందిన నింగ అనే వ్యక్తి నుంచి 3.16 ఎకరాల భూమిని సేకరించింది. ఈ భూముల్లో 1998లో దేవనూరు లేఅవుట్ నిర్మాణాన్ని ముగించింది. ఈ స్థలాల్లో నిర్మించిన ఇళ్లను కేటాయించేందుకు 1998లో నోటిఫికేషన్ వేసిన ముడా వాటిని 2001లో పంపిణీ చేసింది. ముడా దాఖలాల ప్రకారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బావమరిది మల్లికార్జున స్వామి 2004 ఆగస్టులో నింగ అనే వ్యక్తి (మరణాంతరం.. ముడాకు ఇచ్చిన భూముల యజమాని) కుమారుల నుంచి 3.16 ఎకరాల వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వాటిని తన సోదరి (సిద్ధరామయ్య భార్య పార్వతమ్మ)కు 2010లో పసుపు కుంకుమల కింద ఇచ్చారు. ఆ తర్వాత నాలుగేళ్లకు తన పేరిట ఉన్న 3.16ఎకరాల భూములను ముడా అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు పార్వతమ్మ ఫిర్యాదు చేయగా, పొరపాటు జరిగినట్లు అంగీకరించిన ముడా 2020లో పరిహారం కింద మైసూరు విజయనగరలో రూ.55కోట్ల విలువైన 14 స్థలాలను ఇచ్చింది. ఓసారి స్వాధీనం చేసుకున్న భూములు మళ్లీ కొనుగోలు చేయటం, వాటికి పరిహారం చెల్లించటం చట్ట విరుద్ధమని, ముఖ్యమంత్రి తన అధికారాలతో ముడాను తప్పుదోవ పట్టించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ముడా పాల్పడిన అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆలోగా ముఖ్యమంత్రిపై విచారణ కోసం గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు.


వివాదాలకు నిలయం.. మైసూరు నగరాభివృద్ధి సంస్థ కార్యాలయం


ముఖ్యమంత్రిపై కీలక ఫిర్యాదుదారు అబ్రహం

మునిరత్నపై 'సిట్' ప్రశ్నల వర్షం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : గుత్తేదారుని కులం పేరిట దూషించిన కేసులో రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్నను ప్రత్యేక దర్యాప్తు దళం (సిట్) అధికారులు విచారణ కొనసాగించారు. ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. పరప్పన అగ్రహార కారాగారం నుంచి మునిరత్నను అదుపులోనికి తీసుకుని విచారణ చేస్తున్నామని అధికారులు తెలిపారు. అక్టోబరు 5 వరకు సిట్ అదుపులో మునిరత్న ఉండనున్నారు. బెయిలు కోసం ఆయన వేసుకున్న అర్జీ బుధవారం విచారణకు రానుంది.



చెల్లిని కడతేర్చిన అన్న

గదగ, న్యూస్‌టుడే : ఆస్తి కోసం తలెత్తిన వివాదంలో కావ్య (32) అనే గృహిణి తన అన్న ఈశ్వరప్ప చేతిలో హత్యకు గురైంది. హత్య అనంతరం నిందితుడు ముండరగి ఠాణాలో పోలీసుల ముందు లొంగిపోయాడు. కావ్య కొన్నేళ్ల కిందటే కులాంతర వివాహం చేసుకుంది. తనకు రావలసిన ఆస్తి వాటా విషయమై అన్నతో గొడవ పడి పోలీసు ఠాణాలో కేసు పెట్టింది. దీనిపై వారి ద్దరికీ మంగళవారం గొడవ జరిగింది. తన వద్ద ఉన్న కత్తితో చెల్లిపై దాడి చేసి హత్య చేసి పోలీసులకు లొంగిపోయాడు.

బెళగావిలో నినాదాల వివాదం

బెళగావి, న్యూస్‌టుడే : చరిత్ర యోధురాలు చెన్నమ్మ విగ్రహానికి పూల హారాన్ని వేసేందుకు వెళుతున్న కూడలసంగమ బసవజయ మృత్యుంజయస్వామికి మద్దతుగా కొందరు యువకులు హరహర మహాదేవ అంటూ నినాదాలు చేశారు. ఈద్ మిలాద్ జాతా నిర్వహిస్తున్న కొందరు యువకులు దానికి ప్రతిగా అల్లాహో అక్బర్ అంటూ నినాదాలు చేస్తూ, టిప్పు సుల్తాన్ ఫొటోను ప్రదర్శించారు. ఆ ప్రాంతంలో కొంత సమయం ఉద్విగ్న పరిస్థితి నెలకొంది. పోలీసులు అక్కడకు చేరుకుని రెండు వర్గాల యువకులను అక్కడి నుంచి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

'సిద్ధు.. చాలించు నీ పాలన'

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవించి ముఖ్యమంత్రి స్థానానికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర సూచించారు. ముడా అక్రమాల నేపథ్యంలో ముఖ్యమంత్రిని విచారించేందుకు గవర్నర్ గహ్లోత్ అనుమతినివ్వడం సబబేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు. బెంగళూరులోని పార్టీ ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో విలేకరులతో మాట్లాడుతూ కొద్ది నెలలుగా ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని గుర్తు చేశారు. జనతాదళ్‌తో కలిసి మైసూరుకు చేసిన పాదయాత్రకు ఫలితం దక్కిందన్నారు. విచారణకు హాజరయ్యేందుకు ముందు తన పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని పట్టుబట్టారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించి, నైతిక బాధ్యతగా సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని జనతాదళ్ తన ఎక్స్ హ్యాండిల్‌లో ట్వీట్ చేసింది.


విలేకరులతో మాట్లాడుతున్న విజయేంద్ర

రాజీనామా చేయమనలేదే..

మండ్య, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవికి రాజీనామా చేయాలని నేనేమీ డిమాండ్ చేయలేదని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై తాను స్పందించనని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలపైనా న్యాయపోరాటం చేస్తానని చెప్పారు. తాను నిర్దోషిగా రుజువు చేసుకున్న అనంతరమే ఇతరుల విషయాలను మాట్లాడతానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో నలుగురైదుగురు మంత్రులు నాపై ఆరోపణలు చేస్తున్నారని, వారికి బదులివ్వాల్సిన అవసరం తనకు లేదన్నారు.

ఆ హత్య.. మహా కిరాతకం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నెలమంగల సమీపాన మహాలక్ష్మి (29) అనే యువతిని ముక్కలుగా నరికి, రిఫ్రిజిరేటర్‌లో కుక్కిన కిరాతకుడు 'సడోమా సూకిస్టిక్' అనే నేరస్వభావంతో రగిలిపోయినట్లు వైద్య నిపుణులు గుర్తించారు. ఆ వ్యక్తిని తక్షణమే కట్టడిచేసి, కటకటాల వెనక్కి నెట్టకపోతే మరిందరు ఇలాంటి కిరాతకాన్ని చవిచూసే ప్రమాదముందని నగర పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడున్నా తక్షణమే వెదికి పట్టుకుంటే మేలని తేల్చిచెప్పారు. దుండగుడు ఆమె మృతదేహాన్ని 30 ముక్కలుగా నరికి ఉండొచ్చని ప్రాథమికంగా భావించినా.. వైద్య పరీక్షల్లో 59 ముక్కలుగా నరికేసినట్లు తేలిందని గుర్తించారు. ఆమె తలనే మూడు ముక్కలుగా పగులగొట్టాడని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రతి శరీర భాగాన్నీ నరికే సమయంలో ఆనందం పొందాడని అనుమానిస్తున్నారు. ఇలాంటి వారికే సైతరహా లక్షణాలు ఉంటాయని వైద్య నిపుణులు అంచనా వేశారు. మహిళ మృతదేహం ముక్కలను విక్టోరియా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి నివేదికను పోలీసు ఉన్నతాధికారులకు అందించారు. దర్యాప్తు నిర్వహిస్తున్న అధికారులు ఇప్పటికే అనేక ఆధారాలు సేకరించారు. ఈ హత్య వెనుక ఒకరే కాకుండా ఇంకా ఇద్దరు ముగ్గురు ఉన్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. మరోవైపు.. ఆమెతో ఇన్నాళ్లూ సన్నిహితంగా ఉన్న ఓవ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో ప్రశ్నించారు. ఆ వ్యక్తికి ఆమె మల్లేశ్వరంలోని ఓ దుస్తుల దుకాణంలో కలిసి పని చేసే సమయంలో పరిచయమైంది. వారి పరిచయం ప్రేమగా మారినా.. ఆరు నెలల కిందట విడిపోయారని గుర్తించారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య మాటలు లేవు. తనకు కావాలనే దూరమవుతుందనే బాధతో దుండగుడు ఆమెతో పలుమార్లు గొడవపడినట్లు పోలీసులు గుర్తించారు. అసలైన నిందితుడి కోసం పోలీసు బృందాలు ఒడిశాతో పాటు పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో గాలిస్తున్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లోనూ గాలిస్తున్నారు.



మహాలక్ష్మి

ఇస్కాన్‌కు ప్రసాదాల బాధ్యత

హాసన, న్యూస్‌టుడే : ఈసారి హాసనాంబ ఆలయం తలుపులు తెరచినప్పుడు లడ్డూ, దొన్నె ప్రసాదాల తయారీని బెంగళూరులోని ఇస్కాన్‌కు అప్పగించారు. భక్తుల దర్శనాలను దృష్టిలో ఉంచుకుని హాసనాంబ యాప్, లాల్‌బాగ్ పుష్పప్రదర్శన తరహాలో ఆలయం ఆవరణలోనూ ప్రత్యేక అలంకరణలు చేయించాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. ఈ ఏడాది 15 లక్షల మంది భక్తులు దర్శనానికి వస్తారని జిల్లా పాలనా యంత్రాంగం అంచనా వేసింది. రద్దీని నియంత్రించేందుకు రూ.300, రూ.1000 టికెట్లను అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

దసరా సెలవులు ఖరారు!

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : దసరా పండగను పురస్కరించుకుని అక్టోబరు మూడో తేదీ నుంచి 20 వరకు పాఠశాల విద్యార్థులకు సెలవు ఇస్తున్నామని విద్యాశాఖ ప్రకటించింది. అన్ని జిల్లాల్లోని- అన్ని రకాల పాఠశాలలకు ఏకరూప సెలవులు వర్తిస్తాయని సంబంధిత అధికారులు తెలిపారు. విద్యాలయాల నిర్వాహకులు ఈ ఉత్తర్వులు అనుసరించాలని స్పష్టం చేశారు.


పాలన బండి నడిపేదెలా? బెంగళూరులో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఉత్సాహంగా ఆటో నడుపుతున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

భారీ వర్షంతో ముప్పుతిప్పలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని 20 జిల్లాల్లో భారీవర్షాలు మరోసారి ముప్పుతిప్పలు పెడుతున్నాయి. వచ్చే ఆదివారం వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. కలబురగి జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి ఐదు గంటల పాటు కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బెంగళూరులో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాహన సంచారం అస్తవ్యస్తంగా మారింది. ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి, బెళగావి, ధార్వాడ, కొప్పళ, గదగ, హావేరి, రాయచూరు, కలబురగి, విజయపుర, యాదగిరి, బెంగళూరు గ్రామీణం, చిక్కమగళూరు, చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, శివమొగ్గ, తుమకూరు జిల్లాల్లో మరో రెండు రోజులూ భారీ వర్షాలు ఉంటాయని అధికారులు తెలిపారు. మండ్య, మైసూరు, కొడగు, హాసన, చిత్రదుర్గ, చామరాజనగర, బీదర్, బాగలకోటె జిల్లాల్లో సాధారణం నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించారు.


పతకాలు చూపిస్తున్న విద్యార్థి

ఏడు స్వర్ణ పతకాలతో రైతుబిడ్డ ప్రతిభ

ధార్వాడ, న్యూస్‌టుడే: కర్ణాటక విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్రం పీజీ కోర్సులో మయూర్ ఖిలారి అనే విద్యార్థి ఏడు బంగారు పతకాలు దక్కించుకున్నాడు. పేద కుటుంబం కావడంతో సెలవు రోజుల్లో పొలంలో కూలి పనులకు వెళ్లి సంపాదించుకున్న మొత్తాన్ని పుస్తకాలు కొనుగోలు చేసుకునేవాడినని మయూర్ ఖిలారి తెలిపాడు. యల్లాపుర పరిధి కిరవత్తి గ్రామానికి చెందిన రైతు రామచంద్ర, భీమవ్వ దంపతుల రెండవ కుమారుడు మయూర్. చదువుపై ఇష్టంతో కష్టమైనా కూలి పనులకు వెళ్లి తన ఫీజులు, పుస్తకాలకు సంపాదించుకునేవాడని తల్లిదండ్రులు తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ చేతుల మీదుగా మయూర్ పట్టా, పతకాలు అందుకున్నాడు.



సింధనూరు రౌడుకుంద గ్రామంలో ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లికి అభిమానుల ఘనస్వాగతం

‘ప్రజలకు అండగా ఉంటాను’

సింధనూరు: సింధనూరు నియోజకవర్గం ప్రజలకు అండగా ఉంటాను, కష్టంలో మీకు నేస్తమవుతాను.. నన్ను మీ కొడుకుగా భావించండి అని విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లి అభిమానులకు, గ్రామీణ ప్రజలకు పిలుపినిచ్చారు. ఎమ్మెల్సీ అయినందున ఆయన్ను మంగళవారం సాయంత్రం తాలూకాలోని రౌడుకుంద గ్రామంలో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గ్రామం అంతటా వాహనంలో ఊరేగించారు. మెళ్లో గజమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి మాట్లాడుతూ ప్రతిఫలం ఆశించకుండా ప్రజలకు నేను చేసిన సేవలను కాంగ్రెస్ పార్టీ గుర్తించి.. ఈ పదవిని అందించిందన్నారు. ఓ ఎమ్మెల్సీగా నా అభిమానులకు, సింధనూరు నియోజకవర్గం ప్రజలకు సేవ చేస్తానని అన్నారు.

సింధనూరు లయన్స్ ప్రతినిధుల ఔదార్యం



ఉర్దూ పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లు, అందిస్తున్న లయన్స్ ప్రతినిధులు

సింధనూరు: లయన్స్ క్లబ్ సేవలకు కుల మత భేదాలు లేవని.. మాకు అందరూ సమానమే, ఎక్కడ ఆపన్నహస్తం అందించాలో అక్కడ మేం ఉంటామని సింధనూరు సీనియర్ లయన్ ఎన్.వి.సత్యనారాయణ అన్నారు. సింధనూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోనుగుంట్ల రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జనతా కాలనీలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పిల్లల ఆసనాలు, టేబుళ్లు, పుస్తకాల సంచులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు రవీంద్ర మాట్లాడుతూ.. ఇతరులకు సేవ చేసినప్పుడే అసలైన సంతృప్తి లభిస్తుందని అన్నారు. లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధులు శివరామకృష్ణ, వెంకటేష్ గూడపాటి, ప్రకాశ్, పద్మనాయుడు పాల్గొన్నారు.

నగరసభ సభ్యుడిపై కాంగ్రెస్ వేటు

హొసపేటె: నగరసభ ఎన్నికల్లో విప్ నియమాలు ఉల్లంఘించి గైర్హాజరైన సభ్యుడు కె.మహేశ్‌కుమార్ పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేశామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సిరాజ్ షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు జరిగాయి. రెండు రోజుల ముందుగానే 12 మంది కాంగ్రెస్ సభ్యులకు జిల్లాధ్యక్షుడు సిరాజ్ షేక్ విప్ జారీ చేశారు. ఎన్నికల రోజు సభ్యుడు మహేశ్‌కుమార్ గైర్హాజరయ్యారు. ఒక్క ఓటు తేడాతో కాంగ్రెస్ నగర సభను కోల్పోయింది. విప్ జారీ చేసినా హాజరుకాకపోవడం పార్టీ నియమాల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆయన పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేశామని డీసీసీ అధ్యక్షుడు తెలిపారు. ఆయన నగరసభ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని జిల్లా పాలనాధికారిని కోరామని చెప్పారు.

వీరప్పన్ గడ్డ.. పర్యాటక అడ్డా



కొండకోనల్లో కానవచ్చే పులులతో జరభద్రం

ఆకట్టుకునే ‘గోపీనాథం మిస్టరీ’

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అది.. ఒకప్పుడు సామాన్యుడు ప్రవేశించడానికి వణికిపోయే కీకారణ్యం. కాలు మోపాలంటే భూమి కంపించిపోతోందన్న భయం వెంటాడేది. పేరు మోసిన అడవిదొంగ వీరప్పన్ అడ్డా.. గోపీనాథం ప్రాంతం పేరెత్తితేనే పోలీసులూ ఉలికిపాటుకు గురయ్యే రోజులు.. నేడు కరిగిపోయాయి. వీరప్పన్ మరణానంతరం ఆ ప్రాంతం పర్యాటకానికి నెలవుగా మారిపోతోంది. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ.. స్వచ్ఛమైన పర్యావరణ అందాలను వీక్షిస్తూ సాగే ‘గోపీనాథం మిస్టరీ’ పరిసరాలు ఆకట్టుకుంటున్నాయి. కర్ణాటకతో పాటు ఇరుగుపొరుగు తమిళనాడు, కేరళ నుంచి విహారానికి వరుస కడుతున్నారు. దసరా, దీపావళి సెలవులను ఆ ప్రదేశంలో కుటుంబ సభ్యులతో గడిపేందుకు అటవీ విశ్రాంతి మందిరా (జంగిల్ లాడ్జి)లను ముందస్తుగా అందుబాటులోకి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే 75 శాతం గదులు దసరా సెలవులకు పర్యాటకులు రిజర్వు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మైసూరు దసరా ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే వారిలో ఎక్కువ మంది ఈ సాహస పర్యాటకానికి ఆసక్తి చూపుతున్నట్లు గుర్తించారు. నిజానికి.. గోపీనాథం ఓ చిన్న గ్రామం. అక్కడి పరిసరాలే మధురానంద వేదికలు. ఆ అటవీ ప్రదేశంలో ‘జంగిల్ లాడ్జి’లను పర్యాటక, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్మించి నిర్వహిస్తున్నాయి. పర్యాటకులను ఆహ్వానిస్తూ అంతర్జాలంలో బుకింగ్‌లకు అవకాశం కల్పించారు. కావేరి నదిలో పడవ విహారం మరో ప్రత్యేకాంశం. ఎంపిక చేసిన ప్రత్యేక వాహనాల్లో అటవీ ప్రదేశంలో సంచరించేవేళ పులులు, చిరుతలు, ఏనుగులు, జింకలు చూడటానికి అవకాశం కల్పిస్తామని అధికారులు వివరించారు.



పర్యాటక విడిదికి చేరువలోనే గలగలపారే కావేరిమాత

● గోపీనాథం.. పేరంటేనే వీరప్పన్‌కు ప్రతిరూపంగా చెబుతుంటారు. అతడి ఊరి సమీపంలో ‘మిస్టరీ ట్రైల్స్’ ప్రదేశాన్ని గుర్తించారు. రాత్రిళ్లు వింత శబ్దాల కారణంగా దీన్ని మిస్టరీట్రైల్స్‌గా పేరు పెట్టారు. ఆ ప్రదేశమంతా అటవీ శాఖ పరిధిలోనే ఉంది. చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూకా మలైమహదేశ్వర కొండలకు చేరువలోనే కావేరి నదీతీరంలో విహార వాటిక విస్తరించడం గమనార్హం. బెంగళూరు నగరానికి 300 కిలోమీటర్ల దూరంలోని గోపీనాథం చేరుకోవడానికి కొళ్లేగాల నుంచి సొంత వాహనాలు వినియోగించాల్సిందే.



‘గోపీనాథం మిస్టరీ’లో అటవీ పర్యాటక విశ్రాంతి కేంద్రాలు



హొయిహొయిగా.. కావేరి నదిలో పడవ విహారం



కొళ్లేగాల నుంచి మొదలయ్యే అటవీ ప్రాంతాల అందాలు



పొగాకు నియంత్రణ గోడపత్రికను విడుదల చేస్తున్న జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్, వైద్యశాఖ అధికారులు

పొగాకు వినియోగం ప్రాణానికే ముప్పు

హొసపేటె: పొగాకు వినియోగంతో ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందని జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ హెచ్చరించారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గోడపత్రిక విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లు దాటిన తరువాత యువకులు పొగాకు ఉత్పత్తుపై ఆకర్షితులవుతున్నారు, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. పాఠశాలల 100 మీటర్లలోపు ఎలాంటి పొగాకు ఉత్పత్తులను అమ్మకుండా పోలీసులు, వైద్యశాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే పొగాకు వినియోగంతో వచ్చే ముప్పుపై అవగాహన కల్పించాలని సూచించారు. బహిరంగ ప్రాంతాల్లో పొగసేవనను నియంత్రించాలని సూచించారు. అలాంటివారిపైన కేసులు పెట్టాలని తెలిపారు. జిల్లా పంచాయతీ ఉప కార్యదర్శి భీమప్ప లాళి, జిల్లా కార్మికశాఖ అధికారి సూరప్ప దొంబరమత్తూ, వైద్యశాఖ అధికారి డాక్టర్ షణ్ముఖనాయక్, ఎం.పి.దొడ్డమని తదితరులు పాల్గొన్నారు.

మారని భర్త..మనస్తాపంతో భార్య ఆత్మహత్య

హొసపేటె: భర్త తాగుడుకు అలవాటుపడటంతో కుటుంబ నిర్వహణ కష్టమై రాజమ్మ (24) అనే వివాహిత తీవ్ర మనస్తాపంతో, జీవితంపై విరక్తితో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి హొసపేటె తాలూకా కడ్డిరాంపులో జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన మురుగ, రాజమ్మ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. జీవితంలో భర్త తాగుడుకు అలవాటు పడ్డారు. మద్యం మానమని ఆమె ఎన్నిసార్లు మందలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఇదే అంశంపై దంపతులు గొడవపడేవారు. మారని భర్త తీరుతో మనస్తాపానికి గురైన రాజమ్మ పురుగు మందు తాగింది. తీవ్ర అస్వస్థతతో ఉన్న ఆమెను కొప్పళ ఆసుపత్రిలో దాఖలు చేయగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో దూకి మహిళ ఆత్మహత్య

హొసపేటె: హొసపేటె తాలూకా గొల్లరహళ్లి సమీపంలో వివాహిత మహిళ(35) ఒకరు ఎల్లెల్సీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కాలువలో దూకగానే అక్కడే ఈత కొడుతున్న కొందరు ఆమెను కాపాడే ప్రయత్నం చేశారు. అంతలో నీటిలో మునిగి మృతిచెందింది. మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. మృతురాలి ఒంటిపైన గులాబీరంగు జాకెట్, నీలంరంగు చీరపైన ఎర్ర రంగు పూల చిత్రాలు ఉన్నాయి.

హత్యకు దారితీసిన స్నేహితుల నడుమ గొడవ

హొసపేటె: అతిగా మద్యం తాగిన స్నేహితులిద్దరి నడుమ జరిగిన గొడవ ఒకరి హత్యకు దారి తీసింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పట్టణ పరిధి బస్‌డిపో సమీపంలో జరిగింది. రాజాజినగర్‌కి చెందిన స్నేహితులు శాంతకుమార్, హులిగేష్ సాయంత్రం మద్యం తాగి గొడవపడ్డారు. తీవ్ర కోపోద్రిక్తుడైన హులిగేశ్(23), శాంతకుమార్(22)ను చితక బాదాడు. దీంతో కుప్పకూలిన అతను అక్కడికక్కడే మరణించాడు. నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఎస్పీ శ్రీహరిబాబు, అదనపు ఎస్పీ సలీంపాషా, డీఎస్పీ టి.మంజునాథ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్న లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ఉద్యోగుల లక్ష్యం

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నదే ప్రజల సేవ కోసం. ఈ విషయాన్ని తెలుసుకుని మెరుగైన సేవలందించాలని లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు పేర్కొన్నారు. మంగళవారం తాలూకా పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రజలనుంచి విజ్ఞప్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు పని మీద వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలి. తెలియని విషయాల్లో వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ వారిని అనవసరంగా కార్యాలయం చుట్టూ తిప్పితే, లోకాయుక్త పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎలాంటి ధ్రువీకరణపత్రం, దాఖలాలకు ప్రభుత్వం ఖరారు చేసిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్లు రాజేశ్ లమాణి, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

దర్శన్‌కు వెన్నునొప్పి

సదుపాయాలపై కోర్టుకెళ్తాం: న్యాయవాది



దర్శన్‌ను కలిసి బయటకు వస్తున్న న్యాయవాదులు

బళ్లారి: బళ్లారి కేంద్ర కారాగారంలో సినీ నటుడు దర్శన్‌కు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. దీనిపై కోర్టుతో పాటు మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసే ఆలోచన చేస్తున్నట్లు న్యాయవాది సునీల్ పేర్కొన్నారు. జైలులో ఉన్న దర్శన్‌ను న్యాయవాది సునీల్ మంగళవారం మధ్యాహ్నం కలిసి మాట్లాడారు. అనంతరం న్యాయవాది విలేకరులతో మాట్లాడుతూ దర్శన్‌కు కొన్ని రోజులుగా వెన్నునొప్పి ఉంది. ప్రస్తుతం కేంద్ర కారాగారంలో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 2021 జైలు మాన్యువల్ ప్రకారం ఖైదీలకు మెడికల్ పడక, దిండు వంటి సదుపాయం అనుమతి ఉంది. దర్శన్‌కూ వైద్య సదుపాయంతో కలిగిన పడక, దిండు ఏర్పాటు చేయాలని జైలు అధికారులను కోరినట్లు చెప్పారు. జైలు అధికారులు ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మా అభ్యర్థనను తిరస్కరిస్తే కోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. దర్శన్ బెయిల్ పిటిషన్ సెప్టెంబరు 27న సెషన్స్ కోర్టులో విచారణకు రానుంది. అక్కడ తిరస్కరిస్తే హైకోర్టుకు వెళ్తామన్నారు. దీనిపై జైలు అధికారులను వివరణ కోరగా, జైలులో వైద్యుడు ఉన్నారు. సమస్య గురించి చెబితే తగిన పరిష్కారాన్ని సూచిస్తారు. అవసరమైతే మెడికల్ బెడ్ ఏర్పాటు చేస్తాం. దర్శన్ నుంచి అలాంటి సమస్య తమ దృష్టికి రాలేదన్నారు. కోర్టు అనుమతిస్తే వాటిని పాటిస్తామన్నారు. దిండు, మంచం, కుర్చీ కావాలని అడుగుతున్నట్లు అధికారులు తెలిపారు.



చెళ్లకెరె హిందూ మహాగణపతి నిమజ్జన ఊరేగింపులో యువత ఉత్సాహం

ఘనంగా హిందూ మహాగణపతి శోభాయాత్ర

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: చెళ్లకెర పట్టణంలో విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూ మహాగణపతి విగ్రహాన్ని శోభాయాత్ర రహదారుల గుండా కొనసాగించి. ఈ యాత్రలో వేలాది మంది భక్తులు, కార్యకర్తలు యువతీయువకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రఘుమూర్తి, నగరసభ అధ్యక్షురాలు జైయులీ, ఉపాధ్యక్షురాలు సుజాత, వి.హెచ్.పి. తాలూకా అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఆ ట్యాక్సీలను నియంత్రించండి



ఆర్టీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ట్యాక్సీ యజమానులు, చోదకులు

హొసపేటె, న్యూస్‌టుడే: తెల్లబోర్డు వేసుకుని ప్రయాణికులను తరలిస్తూ, పన్ను ఎగ్గొడుతున్న ట్యాక్సీలను వెంటనే నియంత్రించాలి. దీంతో పసుపు బోర్డు ట్యాక్సీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సంఘం అధ్యక్షులు, సభ్యులు స్థానిక ఆర్టీవోను కోరారు. మంగళవారం వారు ఆర్టీవోకు వినతిపత్రం సమర్పించారు. ఆందోళనకు నేతృత్వం వహించిన కొట్రేశ్ తదితరులు మాట్లాడుతూ ఇటీవల తెల్లబోర్డు వేసుకున్న చాలా ట్యాక్సీలు ప్రయాణికులను తరలించి, తమకు అన్యాయం చేస్తున్నాయి. ప్రభుత్వానికి సక్రమంగా పన్ను చెల్లిస్తున్న పసుపుబోర్డు ట్యాక్సీల యజమానులు, చోదకులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. వెంటనే వాటిని గుర్తించి అనుమతి రద్దు చేయాలి, లేదా వాటిని కూడా పసుపు బోర్డులోకి మార్చాలని కోరారు.

ఇప్పటికైనా సిద్ధు దిగి పోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భాజపా జిల్లాధ్యక్షుడు చెన్నబసవనగౌడ పాటిల్

హొసపేటె, న్యూస్‌టుడే: ముడా కేసులో గవర్నర్ ఆదేశాలను హైకోర్టు కూడా సమర్థించింది. సీఎం సిద్ధరామయ్య దోషిగా నిలబడటం ఖాయం. ఇప్పటికైనా ఆయన నైతిక బాధ్యత వహిస్తూ దిగిపోవాలని భాజపా జిల్లాధ్యక్షుడు చెన్నబసవనగౌడ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాదిలోగా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాల మాలధారణ చేసుకుంది. రాబోయే రోజుల్లో మరిన్ని అవినీతి ఆరోపణలు బయటపడే అవకాశం ఉందని జోస్యం పలికారు. తాను అవినీతికి పాల్పడుతూ, అవినీతి మంత్రులను వెనకేసుకుని వస్తున్న సిద్ధరామయ్యకు అధికార దాహం పట్టింది. అన్ని ఆరోపణలు వస్తున్నా ఆయన సీఎం కుర్చీకి అతుక్కుని కూర్చొన్నారని దుయ్యబట్టారు. పార్టీ ప్రముఖులు అశోక్‌జీరె, అయ్యాళి తిమ్మప్ప, బల్లహుణిసి రామణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పదవికి సిద్ధు రాజీనామా చేయాలి



నిరసన తెలియజేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి

బళ్లారి, న్యూస్‌టుడే: ముడా ఆరోపణలకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించాలని గవర్నర్ ఇచ్చిన తాఖీదుపై హైకోర్టు కూడా సమర్థించడంతో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని జిల్లా భాజపా నేతలు మంగళవారం నగరంలో ఆందోళన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా నేతృత్వంలో ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి , బుడా మాజీ అధ్యక్షుడు మారుతిప్రసాద్, సఫాయి కర్మచారి మండలి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు హనుమంతప్ప, డా.అరుణ, కార్పొరేటర్లు గడగి చెన్నప్ప కూడలికి చేరుకుని సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ నేతలు మాట్లాడుతూ ముడాలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారాన్ని అడ్డం పెట్టుకుని సతీమణి పేరు మీదుగా ఇంటి స్థలాలు పొందారన్నారు. దీనిపై సిద్ధరామయ్య అక్రమాలకు పాల్పడినట్లు భాజపా మొదటి నుంచి ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు.

సింధనూరు-రాయచూరు మార్గం విస్తరణకు చర్యలు



పీడబ్ల్యూడీ క్యాంపు 30వ వార్డులో జనం సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు - రాయచూరు మధ్య గల 90 కిలోమీటర్ల రహదారికి మోక్షం లభించనుంది. ఈ నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి వచ్చే నెల నాలుగున రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాదర్లి హంపన గౌడ మంగళవారం పాత్రికేయులకు వెల్లడించారు. నాలుగున ‘సింధనూరు దసరా’ ఉత్సవాన్ని ప్రారంభించడానికి సింధనూరు విచ్చేయనున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ప్రాంతం ప్రజలకు మేలు చేసే మొత్తం రూ.1800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని బాదర్లి వెల్లడించారు. తాలూకాలోని గొరేబాళ క్యాంపు - గాంధీనగర్ మధ్య రూ.20 కోట్లతో గ్రామీణ రహదారి నిర్మాణానికి కూడా అదే రోజున సీఎం భూమిపూజ చేస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే పీడబ్ల్యూడీ క్యాంపులోని 30వ వార్డుకు వెళ్లి అక్కడి ప్రజలతో సమావేశమయ్యారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యలు వినిపించారు. తాగునీటి ఇబ్బందులు, వీధుల్లో దారుల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అంచెలంచెలుగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. నగరసభ కమిషనర్ మంజునాథ్ గుండూరు ఆయన వెంట ఉన్నారు.

కేంద్ర పథకాలు అందరికీ అందాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాధ్యమ సమాచార సంస్థ అదనపు డీజీ రవీంద్ర

హొసపేటె: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు, చివరి వ్యక్తికి అందివ్వడంలో మాధ్యమాల పాత్ర కీలకమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ, మాధ్యమ సమాచార సంస్థ (పీఐబీ) బెంగళూరు అదనపు డీజీ ఎస్.జి.రవీంద్ర పేర్కొన్నారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ, పలు మాధ్యమ సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో విజయనగర జిల్లా హడగలిలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లా పాత్రికేయులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు, మహిళలు, యువత, శ్రమజీవులు, వ్యాపారులు ఇలా పలు రంగాలవారు అభివృద్ధి చెందాలి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కేంద్ర ప్రభుత్వం జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్, ఫసల్‌బీమా పథకం, ముద్రా పథకం, పోషణ్ అభియాన్ తదితర పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని మాధ్యమాలు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు. హడగలి ఎమ్మెల్యే కృష్ణానాయక్ మాట్లాడుతూ..పదేళ్ల మోదీ పాలన జనరంజకంగా సాగిందన్నారు. హడగలి డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు విజయ్ కుమార్ హేమప్ప, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ తిప్పేస్వామి, నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారిణి లక్ష్మీ పాల్గొన్నారు.




లాభాల్లో దమ్మూరు సహకార సంఘం

కురుగోడు తాలూకా దమ్మూరు ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం వార్షిక సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి సహకార సంఘం కార్యనిర్వహణాధికారి ఎస్.ఎం.రేవణసిద్ధయ్య 2023-24 ఏడాది వార్షిక వివరాలను ప్రవేశపెట్టారు. ఈ ఏడాది రూ.7.45 లక్షల నికర ఆదాయం వచ్చినట్లు వివరించారు. సహకార సంఘంలో మొత్తం 858 మంది సభ్యులు ఉండగా, వ్యవసాయ రుణాలు, వ్యాపారం వంటి వాటికి మొత్తం రూ.16.70 కోట్లు అందజేసినట్లు తెలిపారు. రుణాలు తీసుకున్న వారు నిర్దిష్ట సమయంలో తిరిగి చెల్లిస్తే సంఘం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అధ్యక్షుడు శంకరగౌడ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు సిద్ధరామయ్య, సభ్యులు సుగ్రీవప్ప, మంజునాథరెడ్డి, శాశ్వతరెడ్డి, మంజునాథ, ద్యావణ్ణ, దాసర మారెమ్మ, అన్నపూర్ణరవిరెడ్డి, రాధా, రామకోటి రెడ్డి, సుధీర్‌కుమార్, మారెప్ప పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, బళ్లారి

ఉమ్మడి బళ్లారి జిల్లాకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న బుడా మాజీ అధ్యక్షుడు నారా భరత్‌రెడ్డి

బళ్లారి, న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి నిధులు కేటాయించడంలో ఉమ్మడి బళ్లారి జిల్లాకు తీవ్రం అన్యాయం జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన రాజకీయ నేతలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న కలబురగిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో కలబురగి, బీదర్, యాదగిరి జిల్లాల అభివృద్ధికి నిధులు సింహ భాగం కేటాయించారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలో బీఎంసీఆర్‌సీ ఎం.ఆర్.ఐ.కి రూ.10.5 కోట్ల కేటాయింపు, బళ్లారి కొండపైకి రోప్‌వేను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి, హంపీకి సౌండ్ లైట్‌కు నిధులు కేటాయించారే తప్పా... ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పథకాలకు నిధులు కేటాయించకపోయినా ఈ ప్రాంత ఎమ్మెల్యేలు, ప్రతిపక్షాలు మాట్లాడటం లేదని మండిపడ్డారు. బళ్లారి జిల్లాలో విమానాశ్రయం, ఎండు మిరప మార్కెట్, జీన్స్ అపెరల్ పార్క్ తదితర అభివృద్ధి వ్యవహారాలను పట్టించుకోలేదన్నారు. చివరికి బళ్లారి వీఎస్కేయూ, హంపీ కన్నడ విశ్వవిద్యాలయానికి సిండికేట్ సభ్యులను కూడా ఉమ్మడి బళ్లారి జిల్లా వాసులకు తీవ్రం అన్యాయం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేలకు సరైన అవగాహన లేకపోవడంతో బళ్లారికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జిల్లాలో సమర్థవంతమైన నాయకుడు లేక జిల్లా స్థాయి అధికారులు ఆడిందే ఆట... పాడిందే పాటగా మారింది. జిల్లా పాలనాధికారి కార్యాలయం విడిచి బయటకు రావడం లేదు. ప్రజలు సమస్యలు పట్టడం లేదన్నారు. జిల్లాలో దీర్ఘకాలిక సమస్యలపై పార్టీలకు అతీతంగా అందరితో చర్చించి జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట ఒక రోజు సత్యాగ్రహం చేస్తామన్నారు.

దళితుల సమస్యలపై తక్షణమే స్పందించాలి

బళ్లారి, న్యూస్‌టుడే: దళిత సముదాయం విజ్ఞప్తులను వివిధశాఖాధికారులు నిర్లక్ష్యం చేయకుండా..తక్షణమే పరిష్కరించాలని జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలోని నూతన జిల్లా సంకీర్ణ భవనంలో దళిత సముదాయం సమస్యలు, వాటి పరిష్కారంపై ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీ మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారం, చట్టాలపై అవగాహన పెంచుకోవడానికి సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఎస్సీ అట్రాసిటీ నిరోధక చట్టంపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ సమస్యలను సభ ద్వారా స్వేచ్ఛగా చెప్పుకొని పరిష్కారానికి సహకరించాలన్నారు. దళిత వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఓ సారి సమావేశం నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, చిత్రంలో ఎస్పీ శోభారాణి, జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర



సమావేశానికి హాజరైన దళిత సముదాయ ప్రజలు

మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

జిల్లాలో దళిత వర్గాల వారు నివసించే ప్రదేశాల్లో రహదారులు, మురుగు కాలువలు, భూగర్భ మురుగు కాలువలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు నిధులను కూడా ఖర్చు చేయాలన్నారు. జిల్లా పోలీస్ అధికారి శోభారాణి మాట్లాడుతూ దళిత వర్గాలపై కులాలు, హింస, కుల దూషణలు చేసిన కేసులతో ఘటనా స్థలాన్ని పరిశీలించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. శ్మశాన స్థలాలు, బగర్‌హుకం, రైతుల సమస్యలు, రెవెన్యూశాఖ వ్యాప్తిలోకి వచ్చే సమస్యలు, ప్రభుత్వ పథకాలు సరిగ్గా అందడం లేదని పలువురు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, సమాజ కల్యాణశాఖాధికారి మల్లికార్జున, ఎస్సీ కల్యాణశాఖ అధికారి దివాకర, వివిధశాఖల అధికారులు, సముదాయ ప్రజలు పాల్గొన్నారు.

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు



గంగావతిలో మాట్లాడుతున్న ఐజీపీ లోకేశ్‌కుమార్

గంగావతిలో శాంతికి సహకరించాలి

గంగావతి,న్యూస్‌టుడే: ధార్మిక ఆచరణల సమయంలో గంగావతిలో శాంతికి అన్ని వర్గాలు సహకరించాలని బళ్లారి వలయం ఐజీపీ లోకేశ్‌కుమార్ కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ధార్మిక సామరస్యం కోసం పోలీస్ శాఖ పలుమార్లు శాంతిసభలు నిర్వహించిందన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అల్లర్లు చోటుచేసుకోవడంపై విచారం వ్యక్తం చేశారు. పట్టణవాసులు భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తామని పేర్కొన్నారు. కొప్పళ ఎస్పీ రామ్ అరసిద్ధి పాల్గొన్నారు.



ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న మంత్రి సుధాకర్, ఉపకులపతి, తదితరులు

సమాజ సేవకు దక్కిన గుర్తింపు

హుబ్బళ్లి, (మాన్వి) : కర్ణాటక విశ్వవిద్యాలయం ధారవాడ స్నాతకోత్సవ సందర్భంగా మంగళవారం హుబ్బళ్లి కమ్మవారి సంఘం ప్రముఖుడు, సమాజ సేవకుడు హెచ్.వి.ఎస్.వి.ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన సేవలను గుర్తించి ఎంపిక చేసినట్లు ఉప కులపతి కె.బి.గుడిసి వెల్లడించారు. ప్రసాద్‌కు విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్, ఉప కులపతి డాక్టరేట్ అందించారు.

చూశారా పాలకా.. పారిశుద్ధ్యం పడక!

• నగర పాలికెలో పౌరకార్మికుల కొరత • పేరుకుపోతున్న వ్యర్థాలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికెలో పారిశుద్ధ్యం పెద్ద సమస్యగా మారింది. నగరం రోజు రోజుకు విస్తరించడంతో నిత్యం 250 టన్నుల వ్యర్థాలు పోగవుతున్నాయి. దీనికి సరిపడా పౌరకార్మికులు లేకపోవడం, వ్యర్థాలను తరలించే వాహనాలు, రహదారులు శుభ్రం చేసే వాహనాలు, మురుగు కాలువలను శుభ్రం చేసే యంత్రాలు లేకపోవడంతో నగరంలో నిత్యం చెత్త నిర్మూలన పెద్ద సమస్యగా మారింది. అధికారులు పౌరకార్మికుల నియామకం..కొత్త వాహనాల కొనుగోలులో సరైన చర్యలు చేపట్టడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

524 మందే ఉన్నారు

బళ్లారి నగర పాలికె మొత్తం 84 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించింది. 39 వార్డులున్న పాలికెలో బళ్లారి నగర, గ్రామీణ విధానసభ నియోజకవర్గాలు కలిసి ఉన్నాయి. పాలికెలో 1.25 లక్షల కుటుంబాలు, 7.50 లక్షల జనాభా ఉంది. నిత్యం వివిధ పనులపై బళ్లారి నగరానికి వచ్చి పోయే వారి సంఖ్య 30 వేల నుంచి 40 వేల మంది ఉంటారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 4.9 లక్షల జనాభా ఉంది. దీని ప్రకారం నగర పాలికెలో పౌరకార్మికులు, నగర పరిశుభ్రత సహకరించే వాహనాలు ఉన్నాయి. నగరంలో నిత్యం ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను తొలగించడం పెద్ద సవాల్‌గా మారింది.

ప్రతి 700 మందికి ఒక పౌరకార్మికుడు ఉండాలి

రాష్ట్ర ప్రభుత్వం 2018లో ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం ప్రతి 700 మందికి ఓ పౌరకార్మికుడు ఉండాలి. 700 ఇళ్లకు వ్యర్థాలను తొలగించే ఆటో టిప్పర్ అందుబాటులో ఉండాలి. ప్రతి 4.50 కిలోమీటర్లు వ్యర్థాలను తొలగించే ట్రాక్టర్ ఉండాలి. ప్రస్తుతం నగర పాలికె 334 మంది శాశ్వత పౌరకార్మికులు, 190 మంది తాత్కాలిక పౌర కార్మికులు కలిపి మొత్తం 524 మంది విధులు నిర్వహిస్తున్నారు. 200 మంది చోదకులు, లోడర్స్, క్లీనర్లు, 90 మంది భూగర్భ మురుగు కాలువలు శుభ్రం చేసే కార్మికులు ఉన్నారు. ఇంటింటికీ వ్యర్థాలు సేకరించే ఆటో టిప్పర్లు-70, ట్రాక్టర్లు 95 ఉన్నాయి. జేసీబీ-5, టిప్పర్లు-14, కంపోస్ట్-7, యూజీడీ కాలువలను శుభ్రం చేసే వాహనాలు-20, రహదారులపై దుమ్ము, ధూళిని శుభ్రం చేసే స్వీపర్ వాహనాలు రెండు ఉండగా, వాటిలో ఒకటి మరమ్మతులకు గురైంది. బళ్లారి నగర పాలికెలో విధులు నిర్వహిస్తున్న పౌరకార్మికులు, వాహనాలు ఉన్నాయి. ప్రస్తుతం 7.50లక్షల జనాభాకు అనుగుణంగా 1508పైగా ఆటో టిప్పర్లు, 900 మందికిపైగా పౌరకార్మికులు ఉండాలి. 60 శాతం మందితోనే పరిశుభ్రత చర్యలు చేపడుతున్నారు. నగరంలో రోజు ఉత్పత్తి అవుతున్న 250 టన్నుల వ్యర్థాలను తొలగించడం, రహదారులపై వ్యర్థాలు, దుమ్ము, ధూళిని శుభ్రం చేయడం, ఇంటింటికీ వ్యర్థాలను తొలగించడం పెద్ద సమస్యగా మారింది. ఇంటింటికీ వాహనాలు రెండు రోజులకు ఒక సారి వెళ్తున్నాయి. ఇంట్లో వ్యర్థాలను రహదారులు, మురుగు కాలువల్లో వేయడంతో వాటిని శుభ్రం చేయడం నగర పాలికెకు పెద్ద సమస్యగా మారింది.



యంత్రాల సాయంతో మురుగు కాలువ శుభ్రం



రైస్‌మిల్లు రహదారి పక్కన, కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



కౌల్‌బజార్ బైపాస్ వద్ద పాఠశాల వెనక భాగంలో చెత్తాచెదారం

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం

2011 జనాభా లెక్కల ప్రకారం పౌరకార్మికులు, నగర స్వచ్ఛతకు ఉపయోగించే వాహనాలు తక్కువగా ఉన్నాయి. ఉన్న వారితోనే నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. కొత్తగా మరో 23 ఆటో టిప్పర్లను కొనుగోలు చేస్తున్నాం. ఇతర వాహనాలు కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. నగర వాసులు కూడా పాలికె అధికారులకు సహకరించాలి. - మునాఫ్ పాటిల్, నగర పాలికె పర్యావరణ ఇంజినీర్



వ్యర్థాలను ట్రాక్టర్‌లోకి లోడు చేస్తున్న పౌర కార్మికులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక గ్రామీణ బ్యాంకు ప్రధాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర ప్రధాన శాఖ ఆవరణలో ఏర్పాటు చేసిన 'స్వచ్ఛతాహీ సేవా హై' అవగాహన కార్యక్రమాన్ని బ్యాంకు అధ్యక్షుడు దిల్లీబాబు ప్రారంభించి మాట్లాడారు. నగరం పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 1 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దీనిపై నగర వాసులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధాన శాఖ నుంచి ప్రారంభమైన జాతా సత్యనారాయణపేట వైఎంసీఎ, కమ్మ భవనం, పాత కోర్టు రహదారి, గడిగి చెన్నప్ప కూడలి, దుర్గమ్మ దేవస్థానం నుంచి కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు.



అవగాహన జాతాను ప్రారంభిస్తున్న కర్ణాటక గ్రామీణ బ్యాంకు అధ్యక్షుడు దిల్లీబాబు

చిన్నారులకు న్యాయమూర్తి పరామర్శ

గంగావతి,న్యూస్‌టుడే: గంగావతిలో అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు ఊడి గాయపడ్డ చిన్నారులను సీనియర్ సివిల్ న్యాయమూర్తి రమేశ్ గాణిగేర్ మంగళవారం పరామర్శించారు. చిన్నారులు చికిత్స పొందుతున్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించారు. గాయపడ్డ వారికి అవసరమైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. పైకప్పు ఊడిపడిన సంఘటనకు సంబంధించి సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా నగరసభ కమిషనర్, మహిళా,శిశు సంక్షేమాధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ, పాఠశాల భవనాల జాబితా ఇవ్వాలన్నారు.



అంగన్‌వాడీ చిన్నారులను పరామర్శిస్తున్న న్యాయమూర్తి రమేశ్ గాణిగేర్

200 రోజులు పని కల్పించండి

కంప్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కంప్లి తాలూకా రామసాగర కూలీలు డిమాండు చేశారు. ఈ విషయమై మంగళవారం వారు ప్రధానమంత్రికి లేఖ రాశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న దృష్ట్యా రోజూ కూలిని రూ.500కు పెంచాలన్నారు. దేశ సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రధాని మోదీ కూలీల ఆర్థిక ఇబ్బందులను గమనించాలని కోరారు. గ్రామీణ కూలీ కార్మికుల సంఘం నాయకులు ఆనంద్ రామసాగర, అక్క మహాదేవి, పార్వతమ్మ, మల్లమ్మ, మరియమ్మ, నిర్మల, హంపమ్మ పాల్గొన్నారు.



కమిషనర్ గురుప్రసాద్‌కు విన్నవిస్తున్న కువెంపునగర్ వాసులు

కువెంపునగర్‌లో సౌకర్యాలు కల్పించాలని వినతి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: నగరసభ పరిధిలోని 16వ వార్డు కువెంపునగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు నగరసభ కమిషనర్ గురుప్రసాద్‌ను కోరారు. మంగళవారం నగరసభ కార్యాలయంలో న్యాయవాదులు సిద్ధలింగయ్య, తిరుమల, రాజశేఖర్ తదితరులతో కలిసి వారు మాట్లాడుతూ కువెంపునగర్ కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు కావొస్తోంది, నిబంధనల మేరకు ఇక్కడ లేఅవుట్లు ఏర్పాటు చేసుకుని, గృహాలు నిర్మించుకున్నాం. అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా శుద్ధమైన తాగునీరు కుళాయిల ద్వారా అందించడం లేదు, మురుగు కాల్వల్లో చెత్త చెదారం తొలగించడంలేదని ఫిర్యాదు చేశారు. రహదారులు మట్టితో ఉండి గుంతలు ఏర్పడ్డాయి, కనీసం గుంతలు పూడ్చడం లేదన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కాలనీవాసులు మోహన్ లాల్, శాంతయ్యస్వామి, బసవరాజ్, లింగరాజు, విరేశ్‌గౌడ, లక్ష్మణరెడ్డి, మల్లికార్జున ఉన్నారు.

'రెవెన్యూ సేవలు నిలిపేస్తాం'

సిరుగుప్ప, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో చరవాణి, అంతర్జాలం ద్వారా అందిస్తున్న సేవల్లో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించే వరకు సేవలు నిలిపివేస్తామని ఉద్యోగుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర గ్రామ పరిపాలన అధికారులు, ఉద్యోగుల సంఘం జిల్లా, తాలూకా అధ్యక్షులు రామప్ప, వి.విరుపాక్షప్ప, ఆధ్వర్యంలో ఉద్యోగులు గ్రేడ్-2 తహసీల్దార్ సత్యమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో గ్రామ లెక్క అధికారులు, సిబ్బంది చరవాణి యాప్, వెబ్ అప్లికేషన్ల ద్వారా 17 రకాల సేవలు అందిస్తున్నామన్నారు. వీటిపై తమకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు, ల్యాప్‌టాప్‌లు ఇవ్వలేదు, అంతర్జాలం, స్కానర్ సౌకర్యాలు కల్పించకుండా సేవలు అందించాలని తరచూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఉద్యోగులు విధి నిర్వహణలో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాష్ట్ర సమితి తీర్మానం ప్రకారం ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. సంఘం ప్రతినిధులు మంజునాథ్, పరమేశ్, నవీన్‌కుమార్, శివరాజ్, రంగస్వామి పాల్గొన్నారు.



గ్రేడ్-2 తహసీల్దార్ సత్యమ్మ వినతిపత్రం అందిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



కారటగిలో గ్రేడ్ -2 తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామ పాలనాధికారులు

పని ఒత్తిడి తగ్గించండి సారూ

కారటగి: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు పని ఒత్తిడి తగ్గించాలని గ్రామ పాలనాధికారుల సంఘం నాయకులు అధికారులను కోరారు. ఈ విషయమై రెవెన్యూ శాఖ కార్యదర్శికి రాసిన వినతిపత్రాన్ని స్థానిక గ్రేడ్ -2 తహసీల్దార్ విశ్వేశ్వరయ్య సాలిమఠకు మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పని ఒత్తిడి అధికమవడంతో మానసికంగా ఇబ్బందికి గురవుతున్నాం. ఆరోగ్యం దెబ్బతింటోంది. సెలవు రోజుల్లో సైతం పని చేయాల్సి వస్తోంది. మాకు పని ఒత్తిడి తగ్గించాలి. ఖాళీ ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంఘం తాలూకా గౌరవ అధ్యక్షుడు మరుళ సిద్ధప్ప దేవరమని, ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్, ఆదయ్య హిరేమఠ, దొడ్డన గౌడ, వనజాక్షి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మహిళల వినతి

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పట్టణంలోని వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు పురసభ అధ్యక్షురాలు రేఖను కోరారు. పట్టణంలోని 3, 10, 11 వార్డుల్లో మంగళవారం పర్యటించిన ఆమెకు అక్కడి ప్రజలు సమస్యలను వివరించారు. పదో వార్డులో లోతట్టు ప్రాంతాలు వర్షానికి జలమయమయ్యాయి. మురుగునీరు వీధుల్లోకి చేరి అపరిశుభ్రంగా తయారయ్యాయన్నారు. పన్నాపుర మార్గంలోని 11వ వార్డులోనూ ఇదే సమస్య ఉంది. దసరా నవరాత్రుల సందర్భంగా జమ్మి వృక్షానికి రోజూ పూజలు నిర్వహించాలి. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని అక్కడి మహిళలు కోరారు. మూడో వార్డు దేవి క్యాంపు పాత మార్గంలో వర్షపు నీరు, మురుగు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. దసరా నవ రాత్రుల పూజలకు దేవి క్యాంపు కొండకు ఈ మార్గంలోనే వెళ్లాలి. ఈ మార్గాన్ని శుభ్రం చేయాలని కోరారు. త్వరితగతిన పనులు చేపడతామని పురసభ అధ్యక్షురాలు, ముఖ్యాధికారి హామీ ఇచ్చారు.



పురసభ అధ్యక్షురాలికి సమస్యలు వివరిస్తున్న మహిళలు

గణేశ్ నిమజ్జనంలో కత్తిపోట్లు


గంగావతి,న్యూస్‌టుడే: గణేశ్ నిమజ్జనం ఊరేగింపు సమయంలో నృత్యం చేస్తున్న యువకుల మధ్య గొడవ చోటుచేసుకుని కత్తిపోట్లకు దారితీసిన సంఘటన సోమవారం రాత్రి గంగావతి పట్టణంలో చోటుచేసుకుంది. గుండమ్మ క్యాంపులో గణేశ్ నిమజ్జనం జరుగుతుండగా నృత్యం చేస్తున్న శివు (38)ను కత్తితో పొడిచారు. ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో గణేశ్ శ్రీనివాస్(20), మంజు(20), సాగర్(25) అనే యువకులు గాయపడ్డారు. కత్తిపోటుకు గురైన శివును చికిత్స కోసం హుబ్బళ్లి కిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ముత్తణ్ణ, బాబు, ధర్మణ్ణ, జంభ మరో 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాత కక్షలే ఈ దాడులకు కారణమని పోలీసులు తెలిపారు. బళ్లారి ఐజీపీ లోకేశ్‌కుమార్, ఎస్పీ రామ్ అరసిద్ధి మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



గంగావతి గణేశ్ నిమజ్జనం గొడవల్లో గాయపడ్డ యువకులు

కమ్మ సంఘం నాయకుడి మృతికి సంతాపం

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి ఫిర్కా కమ్మ వారి సంఘం మాజీ అధ్యక్షుడు అల్లు అశ్వథనాయుడు (87) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. సముదాయ సంక్షేమానికి ఆయన కృషి చేశారని కమ్మ సంఘం నాయకులు తెలిపారు. కమ్మ సంఘం అధ్యక్షుడు సాయిబాబు, నాయకులు చిగురుపాటి రామబసవేశ్వర రావు, కె.శ్రీనివాస రావు, ఎం.సుధీర్, భట్ట ప్రసాద్, రామచంద్రరావు, కాకర్ల భాస్కర్, పోలూరు ప్రసాద్, సత్యనారాయణ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



అల్లు అశ్వథనాయుడు (పాత చిత్రం)

గర్భిణులకు పరీక్షలు తప్పనిసరి

బళ్లారి, న్యూస్‌టుడే: అధిక రక్తపోటు, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు తరచూ పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స అందించాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డా.యల్లా రమేష్‌బాబు వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణిగా గుర్తించిన రోజు నుంచి రక్తపోటు, బరువు, హెచ్.బి. స్థాయి, మూత్ర పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. రక్తపోటు 120/80, కంటే ఎక్కువగా ఉండటం, రక్తంలో ఐరన్ స్థాయి 11 కంటే తక్కువగా ఉంటే కుటుంబ సభ్యులను ఒప్పించి ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స చేయించాలన్నారు. జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తపోటు, రక్తహీనతకు ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎలాంటి మార్పులు రాకుంటే జిల్లా ఆసుపత్రి, బీఎంసీఆర్‌సీ ఆసుపత్రిలో నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. గర్భిణులను జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లడానికి 108 అంబులెన్స్ అందుబాటులో లేకుంటే వైద్య అధికారులతో మాట్లాడితే వేర్వేరు అంబులెన్స్ వ్యవస్థ కల్పిస్తారని తెలిపారు. బీఎంసీఆర్‌సీ వైద్యుడు డా.వీరేంద్రకుమార్ మాట్లాడుతూ పండగ, జాతరలు, ఊరు జాతర, పూజలు వంటి కారణాలతో చికిత్స ఆలస్యం కాకుండా చేయించుకోవాలన్నారు. వైద్యులు హనుమంతప్ప, ఆశారాణి, విజయలక్ష్మి, చంద్రశేఖర్, వారీజా, అశ్రఫ్ అలి, అధికారి ఈశ్వర్ దాసప్పనవర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌వో డా.యల్లా రమేష్‌బాబు, చిత్రంలో వైద్యులు, అధికారులు

సహకార సంఘం సేవలు విస్తృతం

మాన్వి, న్యూస్‌టుడే : మాన్వి పట్టణానికి పరిమితమైన శారదాంబ సహకార సంఘం సేవలను కల్యాణ కర్ణాటక మొత్తం విస్తరించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సురేష్‌గౌడ తెలిపారు. మంగళవారం బ్యాంక్ కార్యాలయంలో నిర్వహించిన సంఘం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం రూ.11 లక్షల పెట్టుబడితో సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. సీఈఓ రాజ్‌కుమార్, మేనేజర్ విజయకుమార్, ఉపాధ్యక్షుడు సురేష్ సంగాపూర్, బ్యాంక్ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు

మాన్వి, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే హంపయ్యానాయక్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. సిరివార తాలూకా నుగడోణిలో కర్ణాటక ప్రదేశాభివృద్ధి మండలి నిధులతో రహదారి నిర్మాణానికి, మాన్వి పట్టణంలోని కరిడిగుడ్డ రోడ్డు జెమినివాటర్ ఏరియాలో రూ.50 లక్షలతో చేపట్టనున్న రహదారి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఈ రోడ్ల నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. గుత్తేదారులు పనులు సవ్యంగా చేయాలని, అధికారులు సక్రమంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజాపనుల శాఖ అధికారులు శ్యామలప్ప, వీరభద్రప్ప, సత్యనారాయణరెడ్డి, మక్బూద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ గఫూర్, రామకృష్ణ, వీరేశ్, నాగరాజ్, రవికుమార్, ప్రవీణ్‌కుమార్, పురపాలక సంఘం సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.00	1619.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,980	3,455
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,153	9,885
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.539	60.905

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు



కాంస్య పతకం గెలుపొందిన బాలికల జట్టు సభ్యులతో సంస్థ అధ్యక్షుడు తదితరులు

రాష్ట్ర పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: కలబురగిలో ఇటీవల జరిగిన సీబీఎస్‌ఈ పాఠశాలల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలో శ్రీరామనగర్ శ్రీవిద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. 19 ఏళ్లలోపు బాలుర జట్టు, 17 ఏళ్లలోపు బాలికల జట్టు వాలీబాల్ పోటీలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు గెల్చుకున్నారు. పాఠశాలలో మంగళవారం క్రీడాకారులను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు నెక్కంటి సూరిబాబు మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాతీయ స్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఆదర్శ, హెచ్.కె. చంద్రమోహన్, నరేశ్, నాగేశ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

చదరంగంలో సత్తా చాటిన విద్యార్థులు

బళ్లారి జిల్లా పదవీ పూర్వ శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ పదవీ పూర్వ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో బళ్లారి బెస్ట్ కళాశాలకు చెందిన విద్యార్థులు సౌజన్య, కార్తీక్ గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కోనంకి రామప్ప, కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తిలక్‌కుమార్, ప్రధాన ఆచార్యుడు వెంకటేశ్వర్‌రావు తదితరులు అభినందించారు. - న్యూస్‌టుడే, బళ్లారి



బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లా పదవీ పూర్వ శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్.జి పదవీ పూర్వ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బళ్లారి బెస్ట్ కళాశాల విద్యార్థులు గెలుపొంది, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థులు పవన్‌కుమార్‌రెడ్డి, దర్శన్, శశికాంత్, శివకాంత్, ఉగ్గి మనోజ్, సుదర్శన్, గణేష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో కళాశాల యాజమాన్యం, ప్రధాన ఆచార్యుడు అభినందించారు. - న్యూస్‌టుడే, బళ్లారి

క్రీడలు క్రమశిక్షణ నేర్పుతాయి

గంగావతి,న్యూస్‌టుడే: క్రీడలు యువతకు క్రమశిక్షణ నేర్పుతాయని కొప్పళ లోక్‌సభ సభ్యుడు రాజశేఖర హిట్నాళ పేర్కొన్నారు. ఆయన మంగళవారం జిల్లా స్థాయి దసరా ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దసరా ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలో కొప్పళకు పేరు తీసుకురావాలన్నారు. క్రీడాకారుల సాధనకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. జడ్పీ సీఈవో రాహుల్‌రత్నం పాండే, వ్యాయామ విద్యాశాఖాధికారి ఎ.బసవరజ్, మంజునాథ్ గొండబాళ పాల్గొన్నారు.





సదస్సు ప్రారంభ కార్యక్రమంలో సిద్ధరామయ్య తదితరులు


జాగృతి ప్రదర్శనలో పాల్గొన్న బాలలతో డీకే శివకుమార్

రహదారి భద్రతకు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి సిద్ధు వెల్లడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : రహదారి సురక్షతకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పిలుపునిచ్చారు. 'మన రహదారులు- బాధ్యత' పేరిట సొసైటీ ఫర్ ఆటోమోటివ్ ఫిట్‌నెస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ మంగళవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన వార్షిక సదస్సును ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగో అతి పెద్ద వాహన పరిశ్రమగా భారత్ ఎదిగిందని గుర్తు చేశారు. ఇది స్థూల జాతీయోత్పత్తిలో 6.5 శాతం వాటాతో 30 మిలియన్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. గత ఏడాది భారత్‌లో 1.68 లక్షల ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. ఈ ప్రమాదాలతో లెక్కలేనన్ని కుటుంబాలకు తీరని శోకం మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి భద్రత కేవలం ఆర్థిక సమస్య కాదని, జీవన్మరణాలకు సంబంధించిన అంశమని విశ్లేషించారు. కర్ణాటకలో రహదారి భద్రతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రమాదాలను అరికట్టే దిశలో మౌలిక సదుపాయాల వృద్ధి, అధునాతన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 'బ్లాక్ స్పాట్'లను గుర్తించి, అక్కడ అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. స్మార్ట్ ట్రాఫిక్ వ్యవస్థతో ప్రమాదాలు నిలువరించగలిగామని, మోటారు వాహనాల చట్టాల ఉల్లంఘన తగ్గుముఖం పట్టిందన్నారు. అధిక వేగం, మద్యం తాగి వాహనాలు నడపడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించామన్నారు. రహదారి భద్రత, సురక్షతకు సంబంధించిన అంశాలతో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు, ప్రత్యేక కార్యశాలలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యుత్తు వాహనాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. బెంగళూరును హరిత నగరంగా మార్చేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వచ్చే రెండేళ్లలో ఐదు వేల విద్యుత్తు బస్సులను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సుస్థిర అభివృద్ధిలో కర్ణాటకను మోడల్ రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి శివకుమార్ బ్యాటరీ ఆటోను నడిపి సంతృప్తి వ్యక్తం చేశారు. రహదారి సురక్షతకు సంబంధించి విద్యార్థులు ఇచ్చిన మూకాభినయ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.



బ్యాటరీ ఆటో వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి


ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతికి జెండా ఊపుతున్న కుమారస్వామి

ద్విచక్రవాహనాల ఎగుమతి షురూ


బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక అల్ట్రా వైలెట్ ఆటోమోటివ్ సంస్థ తయారు చేస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలను యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేసే ప్రక్రియకు స్థానిక జిగణి పారిశ్రామికవాడలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి జెండా ఊపారు. అధిక సామర్థ్యం కలిగిన ఈ ద్విచక్రవాహనాలను వివిధ దేశాలకు ఎగుమతి చేసే సామర్థ్యం రావడం సంతోషంగా ఉందని మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుమార వివరించారు. పారిశ్రామికరంగంలో కర్ణాటక దూకుడుకు నిదర్శనమే ఈ వాహనాల ఎగుమతని వివరించారు. వీటితో పాటు ఇతర వాహనాల ఉత్పత్తులను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిలో బెంగళూరు దేశంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర, భారీ మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వివరించారు. కార్యక్రమంలో సంస్థ సీటీఓ నీరజ్‌రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.


శివమొగ్గ విమానాశ్రయం

శివమొగ్గకు రెక్కలొచ్చాయ్!

శివమొగ్గ, న్యూస్‌టుడే : శివమొగ్గ విమానాశ్రయం నుంచి హైదరాబాద్, చెన్నైకు వెళ్లేందుకు విమానాలు అందుబాటులోకి వస్తున్నాయని లోక్‌సభ సభ్యుడు బీవై రాఘవేంద్ర వెల్లడించారు. అక్టోబరు 10 నుంచి స్పైస్ జెట్ ఈ విమానాలను అందుబాటులోకి తీసుకువస్తుందని తెలిపారు. నిత్యం ఉదయం 10.40కి చెన్నైలో బయలుదేరే విమానం 12.10కి శివమొగ్గకు చేరుకుంటుంది. శివమొగ్గ నుంచి 12.35కు బయలుదేరే విమానం 2.05కు చెన్నైకి చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 2.40కి బయలుదేరి శివమొగ్గకు 4.10కి మరో విమానం చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.25కి బయలుదేరే ఆ విమానం 5.55కి తిరిగి గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఈ విమాన సేవలతో శివమొగ్గ జిల్లాలో వ్యాపార, పర్యాటక రంగాలకు ఉత్తేజం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వీరప్పన్ గడ్డ.. పర్యాటక అడ్డా


కొండకోనల్లో కానవచ్చే పులులతో జరభద్రం

ఆకట్టుకునే 'గోపీనాథం మిస్టరీ'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అది.. ఒకప్పుడు సామాన్యుడు ప్రవేశించడానికి వణికిపోయే కీకారణ్యం. కాలు మోపాలంటే భూమి కంపించిపోతోందన్న భయం వెంటాడేది. పేరు మోసిన అడవిదొంగ వీరప్పన్ అడ్డా.. గోపీనాథం ప్రాంతం పేరెత్తితేనే పోలీసులూ ఉలికిపాటుకు గురయ్యే రోజులు.. నేడు కరిగిపోయాయి. వీరప్పన్ మరణానంతరం ఆ ప్రాంతం పర్యాటకానికి నెలవుగా మారిపోతోంది. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ.. స్వచ్ఛమైన పర్యావరణ అందాలను వీక్షిస్తూ సాగే 'గోపీనాథం మిస్టరీ' పరిసరాలు ఆకట్టుకుంటున్నాయి. కర్ణాటకతో పాటు ఇరుగుపొరుగు తమిళనాడు, కేరళ నుంచి విహారానికి వరుస కడుతున్నారు. దసరా, దీపావళి సెలవులను ఆ ప్రదేశంలో కుటుంబ సభ్యులతో గడిపేందుకు అటవీ విశ్రాంతి మందిరా (జంగిల్ లాడ్జి)లను ముందస్తుగా అందుబాటులోకి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే 75 శాతం గదులు దసరా సెలవులకు పర్యాటకులు రిజర్వు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మైసూరు దసరా ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే వారిలో ఎక్కువ మంది ఈ సాహస పర్యాటకానికి ఆసక్తి చూపుతున్నట్లు గుర్తించారు. నిజానికి.. గోపీనాథం ఓ చిన్న గ్రామం. అక్కడి పరిసరాలే మధురానంద వేదికలు. ఆ అటవీ ప్రదేశంలో 'జంగిల్ లాడ్జి'లను పర్యాటక, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్మించి నిర్వహిస్తున్నాయి. పర్యాటకులను ఆహ్వానిస్తూ అంతర్జాలంలో బుకింగ్‌లకు అవకాశం కల్పించారు. కావేరి నదిలో పడవ విహారం మరో ప్రత్యేకాంశం. ఎంపిక చేసిన ప్రత్యేక వాహనాల్లో అటవీ ప్రదేశంలో సంచరించేవేళ పులులు, చిరుతలు, ఏనుగులు, జింకలు చూడటానికి అవకాశం కల్పిస్తామని అధికారులు వివరించారు.

● గోపీనాథం.. పేరంటేనే వీరప్పన్‌కు ప్రతిరూపంగా చెబుతుంటారు. అతడి ఊరి సమీపంలో 'మిస్టరీ ట్రైల్స్' ప్రదేశాన్ని గుర్తించారు. రాత్రిళ్లు వింత శబ్దాల కారణంగా దీన్ని మిస్టరీట్రైల్స్‌గా పేరు పెట్టారు. ఆ ప్రదేశమంతా అటవీ శాఖ పరిధిలోనే ఉంది. చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూకా మలైమహదేశ్వర కొండలకు చేరువలోనే కావేరి నదీతీరంలో విహార వాటిక విస్తరించడం గమనార్హం. బెంగళూరు నగరానికి 300 కిలోమీటర్ల దూరంలోని గోపీనాథం చేరుకోవడానికి కొళ్లేగాల నుంచి సొంత వాహనాలు వినియోగించాల్సిందే.


పర్యాటక విడిదికి చేరువలోనే గలగలపారే కావేరిమాత


'గోపీనాథం మిస్టరీ'లో అటవీ పర్యాటక విశ్రాంతి కేంద్రాలు


హాయిహాయిగా.. కావేరి నదిలో పడవ విహారం


కొళ్లేగాల నుంచి మొదలయ్యే అటవీ ప్రాంతాల అందాలు



పేలుడు చోటుచేసుకున్న రామేశ్వరం ఆహారశాల ఇదే

ఐసిస్ సానుభూతిపరులపై అభియోగపత్రం దాఖలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని రామేశ్వరం కెఫేలో పేలుడుకు సంబంధించి ఇద్దరు అనుమానిత తీవ్రవాదులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానంలో అభియోగపత్రాన్ని మంగళవారం దాఖలు చేసింది. ఐసిస్ సానుభూతిపరులు అబ్దుల్ మతీన్ అహ్మద్ అలియాస్ తాహా, ముసావిర్ హుసేన్ షాజిబ్ అలియాస్ షాజిబ్‌లను ప్రధాన నిందితులుగా అభియోగపత్రంలో ఎన్ఐఏ పేర్కొంది. శివమొగ్గ జిల్లాకు చెందిన వీరిపై ఇప్పటికే మొదటి విడతలో అభియోగ పత్రాన్ని దాఖలు చేసింది. బాంబుల తయారీ, పేలుళ్లు, జాతీయ పతాకాన్ని కాల్చడం, తదితర నేరాలు వీరిపై ఉన్నాయని జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు తెలిపారు.

సురేశ్‌కు హరిత పురస్కారం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : సాలుమరద తిమ్మక్క జాతీయ హరిత పురస్కారానికి కురుడు సొన్నేనహళ్లి గ్రామానికి చెందిన సురేశ్ ఎంపికయ్యారు. ఒకటిన్నర దశాబ్దం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 20 వేల కంచాలు, 20 వేల గ్లాసులు, నోటు పుస్తకాలను ఆయన అందించారు. పలువురు విద్యార్థులకు ఫీజులు చెల్లించి, బోధన ఉపకరణాలు సమకూర్చారు. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చుట్టుపక్కల గ్రామాల్లో వేలాది మొక్కలు నాటించి, వాటిని సంరక్షిస్తున్నారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించే కార్యక్రమంలో సాలుమరద తిమ్మక్క ఇంటర్నేషనల్ ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

రూ.35 వేలు పరిహారం ఇవ్వండి

మంగళూరు, న్యూస్‌టుడే : ప్రత్యేక ట్రౌజర్ కోసం ఆన్‌లైన్‌లో రూ.1,399 చెల్లించినా, దాన్ని సరఫరా చేయడంలో విఫలమైన డెకాథ్లాన్ సంస్థకు మంగళూరు వినియోగదారుల న్యాయస్థానం రూ.35 వేల జరిమానా విధించింది. టెక్కింగ్ ట్రౌజర్ ఎంటి-500 కొనుగోలుకు మోహిత్ (23) అనే యువకుడు గత ఏడాది డిసెంబరు 22న నగదు చెల్లించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనకు ట్రౌజర్ అందలేదు. దీనిపై సంస్థ ప్రతినిధులను సంప్రదించినా స్పందన రాకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్ 9న న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ పూర్తి చేసి, వినియోగదారునికి పరిహారాన్ని ఇవ్వాలని వినియోగదారుల న్యాయస్థానం ఆదేశించింది.


కోలారులో కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా కాషాయదండు ప్రదర్శన

గళమెత్తిన కమలదళం


శివమొగ్గలో ఎంపీ రాఘవేంద్ర నేతృత్వంలో భాజపా కార్యకర్తల ధర్నా

మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాల వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించడానికి వీలుగా హైకోర్టు మంగళవారం తీర్పు ప్రకటించడంతో భాజపా శ్రేణులు వీధుల్లోకి వచ్చాయి. తక్షణమే ముఖ్యమంత్రి పదవికి సిద్ధు రాజీనామా చేయాలని నినదించాయి. కలబురగి, శివమొగ్గ, బెంగళూరు, కోలారు తదితర ప్రాంతాల్లో ఈ ఆందోళనలు కొనసాగాయి.

-న్యూస్‌టుడే, శివమొగ్గ, కోలారు

బాలుడితో సహజీవనం.. చివరికి యువతి ఆత్మహత్య

చెన్నై, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన 24 ఏళ్ల యువతి తమిళనాడు రాజధాని చెన్నైలోని పశ్చిమ తాంబరంలోని ఓ దుస్తుల దుకాణంలో పని చేసేది. అదే షాపులో పనిచేస్తున్న 17 ఏళ్ల బాలుడితో పరిచయం ఏర్పడింది. తాంబరం రంగనాథపురం వీధిలో ఇల్లు అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తూ వచ్చారు. మూడు రోజుల కిందట యువతి బాలుడితో కలిసి బయటకెళ్లి ఆదివారం రాత్రి తిరిగొచ్చింది. ఆ ఇంట్లో నుంచి సోమవారం రాత్రి దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగు వారు తాంబరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు పగులగొట్టి లోనికెళ్లగా యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని క్రోంపేట ఆసుపత్రికి తరలించి సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకొన్నారు. బాలుడు ఏమయ్యాడన్న వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థుల వికృత ఆటలు

మడికేరి, న్యూస్‌టుడే : విద్యాలయాల్లో బాలల ఆటలు ఒక్కోచోట అదుపుతప్పుతున్నాయి. కొందరి ఆలోచనలు పెను సమస్యలనూ తెచ్చిపెడుతున్నాయి. అలాంటిదే ఇదీ.. సంపాజెలోని హాస్టల్‌లో ఉంటున్న ఒక విద్యార్థి (12)ని ఇద్దరు సహాధ్యాయిలు మర్మాంగాన్ని పట్టుకుని ఆదివారం రాత్రి వేధించారు. దీంతో మర్మాంగం వాచిపోవడంతో మూత్ర విసర్జన కష్టం కావడంతో బాధితుడికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స ఇప్పించారు. మెరుగైన చికిత్స కోసం మంగళూరులోని వెన్‌లాక్ ఆసుపత్రికి తరలించారు.

మహిషాసుర దసరాకు సన్నాహాలు

మైసూరు, న్యూస్‌టుడే : వచ్చే ఆదివారం మహిషాసుర దసరాను నిర్వహిస్తామని 'మహిష దసరా ఆచరణ సమితి' ప్రకటించింది. చాముండి బెట్టపై ఉన్న మహిషాసురుని విగ్రహానికి పూజ చేసి 'మహిష మండలోత్సవం' పేరిట మహిష దసరా ఉత్సవాలను నిర్వహిస్తామని సమితి ప్రతినిధులు తెలిపారు. మహిష దసరాకు జిల్లా పాలన యంత్రాంగం అనుమతులు ఇవ్వకూడదని మాజీ ఎంపీ ప్రతాప్ సింహ డిమాండ్ చేశారు. ఒకవేళ అనుమతి ఇస్తే తాము ఛలో చాముండి బెట్ట పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.


చాముడి కొండపై మహిషాసురుని విగ్రహం

డీకే శివకుమార్‌కు సత్కారం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను బెంగళూరులోని తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు మంగళవారం ఉదయం సత్కరించారు. ఆయనకు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాల స్మరణికను ప్రదానం చేశారు. తెలుగు విజ్ఞాన సమితి పక్కన ఉన్న స్థలాన్ని శ్రీకృష్ణ దేవరాయ బహిరంగ కళామందిరం, పీయూ, డిగ్రీ కళాశాల, ఆటమైదానం, కళాభవనం నిర్మాణాలకు కేటాయించాలని కోరుతూ శివకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశామని సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ రాజు తెలిపారు. శివకుమార్‌ను సత్కరించిన వారిలో సమితి ఉపాధ్యక్షుడు ఆదికేశవులు నాయుడు, కోశాధికారి సీపీ వరదరాజు, కార్యవర్గ సమితి ప్రతినిధి కృష్ణయ్య నాయుడు తదితరులు ఉన్నారు.


డీకే శివకుమార్‌ను సత్కరిస్తున్న సమితి ప్రతినిధులు


దర్శన్‌కు వెన్నునొప్పి

సదుపాయాలపై కోర్టుకెళ్తాం: న్యాయవాది


బళ్లారి కేంద్ర కారాగారంలో సినీ నటుడు దర్శన్‌ను కలిసి బయటకు వస్తున్న న్యాయవాదులు, జైలు అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి కేంద్ర కారాగారంలో సినీ నటుడు దర్శన్‌కు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. దీనిపై కోర్టుతో పాటు మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసే ఆలోచన చేస్తున్నట్లు న్యాయవాది సునీల్ పేర్కొన్నారు. జైలులో ఉన్న దర్శన్‌ను న్యాయవాది సునీల్ మంగళవారం మధ్యాహ్నం కలిసి మాట్లాడారు. అనంతరం న్యాయవాది విలేకరులతో మాట్లాడుతూ దర్శన్ కొన్ని రోజులుగా వెన్నునొప్పి ఉంది. ప్రస్తుతం కేంద్ర కారాగారంలో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 2021 జైలు మాన్యువల్ ప్రకారం ఖైదీలకు మెడికల్ పడక, దిండు వంటి సదుపాయం అనుమతి ఉంది. దర్శన్‌కూ వైద్య సదుపాయంతో కలిగిన పడక, దిండు ఏర్పాటు చేయాలని జైలు అధికారులను కోరినట్లు చెప్పారు. ఖైదీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకూ ఇప్పటికే తెలియజేశాం. జైలు అధికారులు ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మా అభ్యర్థనను తిరస్కరిస్తే కోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. దర్శన్ బెయిల్ పిటిషన్ సెప్టెంబరు 27న సెషన్స్ కోర్టులో విచారణకు రానుంది. అక్కడ తిరస్కరిస్తే హైకోర్టుకు వెళ్తామన్నారు. దీనిపై జైలు అధికారులను వివరణ కోరగా, జైలులో వైద్యుడు ఉన్నారు. సమస్య గురించి చెబితే తగిన పరిష్కారాన్ని సూచిస్తారు. అవసరమైతే మెడికల్ బెడ్ ఏర్పాటు చేస్తాం. దర్శన్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వివరాలు మా దృష్టికి రాలేదన్నారు. కోర్టు అనుమతి ఇస్తే వాటిని పాటిస్తామన్నారు. దిండుతో పాటు మంచం, కుర్చీ కావాలని దర్శన్ అడుగుతున్నట్లు జైలు అధికారులు తెలిపారు.

బెంగళూరులో పండ్లు, కూరగాయల ధరలు



(హాప్‌కామ్స్- కిలో..రూ.లలో)

● బీన్స్-	55
● క్యారెట్-	65
● బీరకాయలు-	40
● క్యాబేజి-	20
● కాలీఫ్లవర్ (ఒక్కోటి)-	25
● సొరకాయ-	35
● దొండకాయలు-	45
● పొట్లకాయ-	35
● టమాటా(నాటు)-	45
● టమాటా (సాధారణం)	38
● గుమ్మడి-	40
● ఆలుగడ్డ-	35
● ఉల్లిగడ్డలు(మేలురకం)	65
● ఉల్లిగడ్డలు(సాధారణం)	50
● సాంబారు ఉల్లి	95
● బీట్‌రూట్	25
● వంకాయలు	48
● బెండకాయలు	40
● ముల్లంగి	40
● నిమ్మకాయ	200
● వాషింగ్టన్ ఆపిల్:	05
● సిమ్లా ఆపిల్-	150
● గ్రీన్ ఆపిల్-	320
● అరటి కాయలు-	34
● సపోటా-	55
● పైనాపిల్	38
● బొప్పాయి-	44
● ఆరంజి-	85
● బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

శస్త్రచికిత్సలతో ముందడుగు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : గడచిన రెండు దశాబ్దాల్లో మెదడు, నరాలకు సంబంధించిన 20 వేల శస్త్రచికిత్సలను నిర్వహించామని నారాయణ హెల్త్ సిటీ అనుబంధ నారాయణ నరాల వైద్య విభాగం వెల్లడించింది. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 2024లో ఈ ఆసుపత్రిని ప్రారంభించారని మంగళవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ కోమల్ ప్రసాద్ తెలిపారు. ఏడాదికి సగటున వెయ్యి శస్త్రచికిత్సలను నిర్వహించిన మొట్టమొదటి ఆసుపత్రిగా రికార్డు నెలకొల్పామన్నారు. న్యూరో ఆంకాలజీ, స్కల్ బేస్ సర్జరీ, ఎండోస్కోపిక్ సర్జరీ, మూర్ఛకు శస్త్రచికిత్స, ఫంక్షనల్ న్యూరో సర్జరీ, వెన్నెముకకు శస్త్ర చికిత్స విభాగాల్లో ఉత్తమ, అరుదైన శస్త్రచికిత్సలను నిర్వహించామని వివరించారు. బాలల్లో కనిపించిన అత్యంత కఠినమైన ఆరోగ్య సమస్యలకు శస్త్రచికిత్సలు చేశామని మరో వైద్యుడు డాక్టర్ శిబు పిళ్లై తెలిపారు.


చికిత్స పొందిన వారితో వైద్య నిపుణులు

బెంగళూరు


•బెంగళూరు •హోసూరు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



అధిక మార్కులు పొందిన విద్యార్థులందరికీ బ్రాహ్మణ సభ ప్రతిభా పురస్కారాలు అందజేసి ఉత్సాహాన్ని నింపడం అభినందనీయమని యశ్వంతపుర ఎమ్మెల్యే సోమశేఖర్ అన్నారు. కెంగేరి ఉపనగరం బ్రాహ్మణ సభ గాయత్రి మందిరంలో పది, పియూసీ, డిగ్రీతో పాటు ఇద్దరు సీఏ విద్యార్థులతో సహా మొత్తం 76 మందికి ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఎమ్మెల్యే, సభా అధ్యక్షుడు హెచ్.ఎస్.సుధీంద్రకుమార్, తుముకూరు విశ్వవిద్యాలయ మాజీ అకాడమిక్ కౌన్సిల్ సభ్యుడు సతీష్ ప్రారంభించారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (కెంగేరి)

వినాయకుడి లడ్డూ రూ.60 వేలు



ప్రవాసాంధ్రులు అధికంగా నివసించే కమ్మగుండనహళ్లిలో ఎస్ఆర్‌సీ బృందం ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను మంగళవారం ప్రముఖ పారిశ్రామికవేత్తలు కె.యం.కె.రావు, ప్రసాద్‌రావులు రూ.60వేలకు వేలం పాటలో సొంతం చేసుకున్నారు. తొలుత గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. కేఎంకే రావు మాట్లాడుతూ గ్రామస్థులందరం కలిసి లంబోదరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. నిర్వాహకులు చెన్నయ్య, ఎస్ఆర్‌సీ బృందం, యువకులు, భక్తులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, బెంగళూరు (జాలహళ్లి)

హోసూరు కబుర్లు

పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు తాలూకా బెళత్తూరు, సేవగానపల్లి గ్రామ పంచాయతీల్లో అర్హులైన పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నివేశన పట్టాలు ఇస్తోందని స్థానిక ఎమ్మెల్యే వై.ప్రకాష్ అన్నారు. ఆయన మంగళవారం ఆ రెండు గ్రామాల్లో పర్యటించి 15 పేద కుటుంబాలకు నివేశన పట్టాలకు సంబంధించిన ఉత్తర్వులను అందజేశారు. బెళత్తూరు పంచాయతీలో పదకొండు, సేవగానపల్లి గ్రామ పంచాయతీలో నాలుగు కుటుంబాలకు పట్టాలు వితరణ చేసినట్లు చెప్పారు. ఆయన వెంట బెళత్తూరు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు మునిరాజు, డీఎంకే హోసూరు యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, సహ కార్యదర్శి వీరభద్రన్, వార్డు సభ్యులు తదితరులున్నారు.



అర్హులకు నివేశన పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్

ప్రభుత్వ సాధనలపై చిత్ర ప్రదర్శన

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు సమీప కెలమంగలం పరిధి ఆనె గొళ్ల గ్రామ పంచాయతీ దొడ్డబేలూరు గ్రామంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వ మూడేళ్లలో సాధించిన విజయాలు, కార్యక్రమాలపై చేపట్టిన ప్రచారంలో భాగంగా జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసింది. వాటిని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రదర్శనలో మహిళల అభివృద్ధి పథకాల వివరాలు, వివాహాలకు నిధి సాయం, విద్యార్థుల వైద్యపథకం రుణం తదితర సంక్షేమ పథకాలకు సంబంధించిన చిత్రాలను ఉంచారు. వివిధ శాఖల అధికారులు వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.



ఫొటోలు వీక్షిస్తున్న గ్రామస్థులు

దౌర్జన్యాలను అడ్డుకోవడమే లక్ష్యం

హోసూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలపై దౌర్జన్యాలు జరగకుండా అధికారులు నిఘా పెట్టాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సరయు ఆదేశించారు. జిల్లా కేంద్రం కృష్ణగిరిలోని కలెక్టర్ కార్యాలయ సభాంగణలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి పలు సూచనలు చేశారు. ఇటీవల దళితులపై దాడులు ఎక్కువగా జరగడం శోచనీయమన్నారు. బాధిత కుటుంబాలకు పరిహార నిధిని అందించడానికి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ తంగదురై, ఎస్సీ, ఎస్టీ విభాగం అధికారి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సరయు

గుంతల పూడ్చివేత పనుల తనిఖీ


• అర్ధరాత్రి రహదారులపై డిప్యూటీ సీఎం



గుంతల్లో వేసిన తారు నాణ్యతను గునపంతో పరీక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి శివకుమార్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని బెంగళూరు నగర రహదారులను ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాలికె ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వేకువజాము 2 గంటల వరకు ఆయన వివిధ ప్రాంతాల్లో సంచరించారు. రహదారులపై పడిన గుంతలను పాలికె అధికారులు దగ్గరుండి కార్మికుల చేత పూడిపిస్తున్నారు. పనులు నాణ్యతగా లేవని, చాలాచోట్ల గుంతలను వదిలేశారని నగరవాసులు, సివిక్ సంస్థలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అర్ధరాత్రి పూడ్చిన గుంతల తనిఖీ చేపట్టారు. సంజయనగర, హెబ్బాళ్, ఆర్‌టీనగర, శివాజీనగర, హలసూరు, దొమ్మలూరు, కోరమంగల, జయనగర, విజయనగర, ఆర్‌ఆర్‌నగర, యశ్వంతపుర, శాంతినగర తదితర ప్రాంతాల్లో ఆయన స్వయంగా గుంతలను పరిశీలించారు.

గునపం చేతపట్టిన ఆయన తారు నాణ్యతను పరిశీలించారు. వర్షంతో రోడ్లపై నిలబడిన నీటిని పరిశీలించిన ఆయన నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పాలికె అధికారులకు సూచించారు. గత 20 రోజుల్లో నగరంలో 14 వేల గుంతలు పూడ్చారని, ఇంకా ఉన్నాయని, పూడ్చివేత ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు. పనుల నాణ్యతపై విమర్శలు వస్తున్నందున తానే స్వయంగా వాటిని పరిశీలించేందుకు సంచార రద్దీ తక్కువగా ఉంటుందనే అర్ధరాత్రి సమయాన్ని ఎంచుకున్నట్లు తెలియజేశారు. ఆయన వెంట బీడీఏ అధ్యక్షుడు ఎన్.ఎ.హ్యారిస్, మాజీ మేయర్ సంపత్ కుమార్, చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తదితరులున్నారు.



కబ్బన్ ఉద్యానంలో విరిగిపడిన చెట్టు



రహదారిపై భారీ గుంత

విరిగిన చెట్టు.. పూడ్చని గుంత

బెంగళూరు (శివాజీనగర) : నగరంలోని కబ్బన్ ఉద్యానంలో ఒక చెట్టు మంగళవారం కూకటివేళ్లతో సహా విరిగిపడింది. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మరోవైపు నగరంలోని రహదారులపై పడిన గుంతలను పూడ్చామని పాలికె అధికారులు ప్రకటించారు. విల్సన్ గార్డెన్‌లో ఈ లోతైన గుంత అధికారుల కళ్ల నుంచి తప్పించుకుందని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.

మహిళా సంఘాలకు రూ.4,500 కోట్ల రుణాలు

తుముకూరు : మహిళలు సొంతంగా ఉపాధి అవకాశాలు పొందడానికి తుమకూరు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రూ.4500 కోట్ల రుణాలను ధర్మస్థల గ్రామాభివృద్ధి పథకం కింద పంపిణీ చేసినట్లు శిక్షణ కేంద్రం డైరెక్టర్ కె.ఎన్.వాదిరాజు తెలిపారు. తుమకూరు హనుమంతపుర ప్రాంతంలోని కొల్లాపురమ్మ సముదాయ భవనంలో మంగళవారం ప్రతినిధుల సమావేశం జరిగింది. ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే ఆశయసాధనకు కృషి చేస్తున్నామని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రుణాలు తిరిగి చెల్లింపు వందశాతం పూర్తయినట్లు హర్షం వెలుబుచ్చారు. పథకం ప్రాంతీయ డైరెక్టర్ శీనప్ప మాట్లాడుతూ 50 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, లక్ష మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందుతున్నట్లు వివరించారు. 10 జాతీయ బ్యాంకుల నుంచి రుణాలను పంపిణీ చేయించామన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ సతీష్ సువర్ణ, తాలూకా ప్రణాళికాధికారి సందేష్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

ముఖ్యమంత్రి రాజీనామాకు డిమాండ్

వాడవాడలా భాజపా నిరసన



తుమకూరు: టౌన్‌హాల్‌లో ఎమ్మెల్యేలు, పదాధికారులు, నాయకుల నిరసన

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) నుంచి 14 ఇంటి స్థలాల మంజూరు కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, ఆయన నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని ఎంపీ గోవిందకారజోళ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇక్కడి భాజపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో సీఎం రామకృష్ణహెగ్డె తనపై దొంగతనంగా టెలిఫోన్ సంభాషణలు విన్న ఆరోపణలు రావడంతో పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు.

తుమకూరు: ముడా కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విచారణ ఎదుర్కోవాలని హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేయాలంటూ భాజపా నాయకులు పట్టణంలో నిరసన తెలిపారు. నగరంలోని టౌన్ హాల్ సర్కిల్ వద్ద నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ ఆందోళనకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎల్లవేళలా నైతికత, సమాజవాద పాఠాలు చెప్పే సిద్ధరాయయ్య అదే నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. తుమకూరు రూరల్ ఎమ్మెల్యే సురేష్‌గౌడ, వివిధ మోర్చాల పదాధికారులు నిరసనలో పాల్గొన్నారు.

నగరంలో ఈనాడు

- ఉదయం 11 గంటలకు బసవనగుడి బీపీ వాడియా రోడ్డులోని ఐఏడబ్ల్యూసీ మందిరంలో చిత్రకళ ప్రదర్శనను కళాకారులు గణపతి అగ్నిహోత్రి, వి.హరిరామ్ కలిసి ప్రారంభిస్తారు.
- సాయంత్రం 6 గంటలకు జేసీ రోడ్డులోని రవీంద్ర కళాక్షేత్రలో సాహిత్య కళాకారుల వేదిక నిర్వహించే కార్యక్రమంలో గణేశ్ అమీనగడ రాసిన రంగబానాడి పుస్తకాన్ని ఎమ్మెల్సీ ఉమాశ్రీ ఆవిష్కరిస్తారు.
- సాయంత్రం 6.45 గంటలకు మల్లతహళ్లి కళా గ్రామలో సంస్థ నాటకోత్సవాలు కొనసాగుతాయి. కర్ణాటక సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ముకుందరాజ్, కర్ణాటక రంగపరిషత్తు అధ్యక్షుడు జయశంకర్ పాల్గొంటారు.
- రాత్రి 7.30 గంటలకు జేపీనగర ఆర్‌కే కాలనీలోని రంగశంకర్ మందిరంలో 'సిల్వ్రతేన్ ది ర్రింకల్స్ ఇన్ టైమ్' నాటక ప్రదర్శన ఉంటుంది. -న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

దాసరహళ్లిలో నీటి ఎద్దడి నివారణకు కృషి

బెంగళూరు (జాలహళ్లి): దాసరహళ్లి నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూస్తానని ఎమ్మెల్యే ఎస్.మునిరాజు అన్నారు. ఆయన మంగళవారం ఇక్కడి బాగలగుంట పరిధిలోని కొత్త కాలనీల్లో వేసిన తాగునీటి బోరుకు మోటార్ బిగించి నీటిని విడుదల చేసి మాట్లాడారు. ప్రతి వార్డు అధ్యక్షుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎక్కడెక్కడ నీటి ఎద్దడి ఉందో గుర్తించి అధికారుల దృష్టికి తేవాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండకూడదని, ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వేసవి నాటికి కాలనీల్లో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాజపా దాసరహళ్లి అధ్యక్షుడు సోమశేఖర్, ఉపాధ్యక్షుడు గంగరాజన్న, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



తాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మునిరాజు

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు

బెంగళూరు (క్రీడలు) : బాక్సింగ్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో నిర్వహించిన బాక్సింగ్ పోటీలో బాక్సర్లు క్రీడాభిమానులను రంజింపచేశారు. పోటీలకు సిద్ధం చేయడంతో పాటు బాక్సింగ్ క్రీడను ప్రోత్సహిస్తామని గ్రాస్రూట్ వ్యవస్థాపకుడు ముజ్తబకమల్ తెలిపారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన 36 మంది బాక్సర్లు పోటీల్లో పాల్గొన్నారు. వివిధ గ్రూపుల్లో రోహిత్‌చౌదరి, అమన్ బహద్దూర్, వన్లాలునియా, జితేంద్రయాదవ్, మణికందన్, చాందినీ మెహ్రా, లాల్దింసంగ, మహమ్మద్‌శమీద్, శర్వన్ రంజిత్‌దాస్ విజేతలుగా నిలిచారు.



తలపడుతున్న బాక్సర్లు

మెరుగైన సదుపాయాల కల్పనే ధ్యేయం

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: పురపాలికల్లో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లాధికారి పీఎన్ రవీంద్ర తెలిపారు. పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో మునిసిపల్ సమితి ఏర్పాటు చేసిన పౌర కార్మికుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వస్తోందని చెప్పారు. స్వచ్ఛభారత్ భావనను కొనసాగిస్తూ, ప్రజల్లోనూ స్వచ్ఛతకు సంబంధించి జాగృతి కల్పించే రాయబారులుగా వారు పనిచేస్తున్నారని ప్రశంసించారు. నగరసభ అధ్యక్షుడు ఎ.గజేంద్ర, పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు జె.నాగరాజు, అధికారులు అశ్విన్, మాధవి, డాక్టర్ మంజుళ, ఉమాశంకర్, జీవిక రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి

భూముల పంపిణీకి రైతుల డిమాండ్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: పేద రైతులకు మిగులు భూములు పంపిణీ చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ మంగళవారం చిక్కబళ్లాపుర జిల్లా బాగేపల్లిలో అఖిల భారత కిసాన్ సభ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాలూకా కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవలింగప్ప మాట్లాడుతూ గ్రామాల్లో మిగులు ప్రభుత్వ భూములను పేదలకు పంచకుండా శ్రీమంతులు తప్పుడు పత్రాలతో ఆక్రమిస్తున్నారని, ఇందుకు పాలకులు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. బాగేపల్లి పట్టణంలో నివసిస్తున్న పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.



బాగేపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పేదలు

దేశవాళీ ఆవులతో గోశాల ఏర్పాటుకు వినతి

బెంగళూరు (యశ్వంతపుర): తితిదే లడ్డూ తయారీకి ఆవు నెయ్యి వినియోగించాల్సి ఉన్నందున, దేశవాళీ ఆవులను కొనుగోలు చేసి భారీ గోశాలను ఏర్పాటు చేస్తే కల్తీ సమస్య తీరుతుందని కాంగ్రెస్ నేత ప్రదీప్‌కుమార్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కల్తీ నెయ్యిని బయట నుంచి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు.

వ్యాపార సదస్సుపై నిప్పులు



భారతీయ విజ్ఞాన సంస్థ వెలుపల నిరసనకారులు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : భారతీయ విజ్ఞాన సంస్థలో సోమవారం 'భారత్- ఇజ్రాయిల్ వ్యాపార సదస్సు'ను నిర్వహించడాన్ని వివిధ సంఘాల ప్రతినిధులు ఖండించారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు క్లిఫ్టన్ రోజారియా, ఖగోళ శాస్త్రవేత్త ప్రజ్వల్ శాస్త్రి నేతృత్వంలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న విద్యావేత్తలు ప్రభుత్వం, భారతీయ విజ్ఞాన సంస్థ ప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటువంటి సదస్సులతో పాలస్తీనాలో జరుగుతున్న నరమేధాన్ని సమర్థించినట్లు అవుతుందని క్లిఫ్టన్ రోజారియా విమర్శించారు.

పుట్టయ్య స్మారక ఫుట్‌బాల్ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుట్టయ్య స్మారక కప్ ఫుట్‌బాల్ పోటీలను అంబేడ్కర్ అభివృద్ధి మండలి అధ్యక్షుడు, మాజీ మేయర్ ఆర్.సంపత్ రాజ్ ప్రారంభించారు. మంగళవారం బెంగళూరు ఫుట్‌బాల్ మైదానంలో జరిగిన పోటీలో కిక్‌స్టార్ట్ జట్టు 7-1 గోల్స్ తేడాతో ఆర్మీ సర్వీస్ సెంటర్ జట్టుపై విజయం సాధించింది. విజేత జట్టుకు సుధీర్ మూడు, అల్‌ఫర్డ్ రెండు, సిద్ధార్థ్ ఎడ్విన్, ప్రతాప్ తలా ఒక గోల్ సాధించారు. ఓటమి జట్టులో టి.కృష్ణకాంత ఒక గోల్ చేశాడు. మరో పోటీలో రూట్స్ జట్టు 3-1 గోల్స్‌తో ఎంఎఫ్ఏఆర్ స్టూడెంట్స్ యూనియన్ జట్టుపై గెలుపొందింది. ఈ సందర్భంగా సంపత్‌రాజ్‌ను సంఘం తరపున సత్కరించారు.

పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛ సేవ

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: పురాతన కోటలు, పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వాటిని సంరక్షించి ముందు తరాలకు కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా పాలనాధికారి వెంకటేశ్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతాహి సేవా అభియాన్‌లో భాగంగా ప్రసిద్ధి చెందిన చిత్రదుర్గం కోటలో నిర్వహించిన శ్రమదానంలో పాల్గొన్న కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పర్యాటక స్థలాలను పరిశుభ్రంగా ఉంచితే పర్యాటకులు పెరిగి ఆదాయం వస్తుందన్నారు. నగరాభివృద్ధి శాఖ డైరెక్టర్ మహేంద్రకుమార్, నగరసభ కమిషనర్ రేణుక, సాహస వీరుడు జ్యోతిరాజ్, ప్రిన్సిపల్ నాగరాజ్, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు శ్రమదానం చేశారు.

బెంగళూరు (క్రీడలు): బెంగళూరు నగర విశ్వవిద్యాలయ రాష్ట్రీయ సేవా యోజన-ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత, ఎన్ఎస్ఎస్ దినాచరణను ఉపకులపతి ఆచార్య లింగరాజగాంధీ ప్రారంభించారు. విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.



చిత్రదుర్గం కోటలో చీపురు చేతపట్టి శుభ్రం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ తదితరులు

బైక్ రేసులో నగరవాసుల సత్తా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: నమీబియాలో జరిగిన ప్రపంచ జీఎస్ మోటారుసైకిల్ రేస్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించిన నగరానికి చెందిన సర్దార్ శహన్‌ఖాన్, దేవ్ మొదటి పదిమందిలో నిలిచి సత్తాచాటారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శహన్‌ఖాన్ రేస్ అనుభవాలు పంచుకున్నారు. ఆరు రోజుల పాటు జరిగిన ఈ రేస్‌లో 22 దేశాల నుంచి పోటీపడ్డారన్నారు. కొండలు, గుట్టల గుండా రేస్ సాగిందని, కొత్త అనుభూతి ఇచ్చిందన్నారు. తన తండ్రి సర్ఫరాజ్‌ఖాన్ కూడా బైక్ రేస్ ఆరాధకుడని, ఆయన స్ఫూర్తితో ఈ క్రీడను ఎంచుకున్నట్లు తెలిపారు. దేవ్ మాట్లాడుతూ 21 ఏళ్లకు అంతర్జాతీయ బైక్ రేస్‌లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. శహన్‌ఖాన్ రేస్ సమయంలో గాయపడినా భారత్‌ను టాప్ టెన్‌లో నిలిపాడని తెలిపారు. శహన్‌ఖాన్ తల్లి హుస్నా సర్ఫరాజ్‌ఖాన్ తన కుమారుడి సాధనపై ఆనందాన్ని వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న శహన్‌ఖాన్, పక్కన దేవ్

క్రైం కార్నర్



వివరాలను వెల్లడిస్తున్న అనంతపురం గ్రామీణం డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయ్‌కుమార్

క్రికెట్ బెట్టింగ్ గుట్టు రట్టు

- 19 మంది బుకీల అరెస్టు
- రూ.8.60 లక్షల నగదు, 2 కార్లు, 19 చరవాణిలు స్వాధీనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్డీటీ మైదానంలో జరిగిన దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాన్ని జిల్లా పోలీసులు ఛేదించారు. కర్ణాటక, హరియాణా రాష్ట్రాలకు చెందిన 19 మంది బుకీలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.60 లక్షల నగదు, 2 కార్లు, 19 చరవాణిలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన శివానందగౌడ, లోహిత్, మధు, గురుప్రశాంత్, బిఎస్ విశ్వాస్, యోగేశ్, అరుణ్, వికాశ్, నవీన్‌కుమార్, రోహిత్, మోహన్‌కుమార్, అరుణ్ కుమార్..హరియాణాకు చెందిన సోంబీర్ సింగ్, సందీప్ కుమార్, తుషార్ వాద్వా, కౌశల్ ఖురానా, అంకిత్ జాంగ్రా, ధీరజ్ చుగ్, అనుభవ్ కుమార్‌లు నిందితులుగా తేల్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను అనంతపురం గ్రామీణం డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయ్‌కుమార్‌లతో కలిసి రాప్తాడులోని సబ్ డివిజనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన రాజు



తీవ్రగాయాలైన మారుతిప్రసాద్

పావగడ, న్యూస్‌టుడే : పట్టణానికి సమీపంలోని టి.ఎన్.పేట గ్రామం దగ్గర మంగళవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యారు. సీఐ సురేశ్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన గంగాధర, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు రాజు ఆచారి (26) పావగడ నుంచి కోగిరకు ద్విచక్రవాహనంలో వెళుతున్నాడు. అదే సమయంలో రొద్దం బి.సి కాలనీ వాసి మారుతి ప్రసాద్ పావగడకు వస్తుండగా టి.ఎన్.పేట సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో పోలీసులు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు ఆచారి మృతి చెందగా, తీవ్రగాయాలైన మారుతి ప్రసాద్ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తుమకూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. రాజు ఆచారి సోమందేపల్లిలో చేనేత మగ్గాలను నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. మారుతి ప్రసాద్‌కు ఎనిమిది రోజుల క్రితం తాలూకాలోని కడపలకెరె గ్రామంలోని దివంగత గంగాధర, హనుమక్క కూతురు మమతతో వివాహమైంది. ఇద్దరి బంధువుల ఆర్తనాదాలతో ప్రభుత్వ ఆసుపత్రి మారుమ్రోగింది. సంఘటనా స్థలానికి సీఐ సురేశ్, ఎస్ఐ గురునాథ్, ఏఎస్ఐ గోవిందప్ప, పోలీసులు నాగేశ్, శ్రీకాంత్ చేరుకొని స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో దుండగుడి అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: యువతి కోసం స్నేహితుడు వరుణ్ కోట్యాన్(24)ను హత్య చేశాడనే ఆరోపణపై నిందితుడు దివేశ్‌హెగ్డే (24)ని సంజయనగర పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21న రాత్రి యువతి కోసం ఇద్దరూ గొడవపడగా, హత్యకు దారి తీసినట్లు డీసీపీ సైదులు ఆడావత్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిందితుడి కోసం గాలింపు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: ఓ ప్రైవేటు కంపెనీ ఉద్యోగి నాగేశ్‌పై రసాయనాలతో దాడికి పాల్పడిన నిందితుడి కోసం కామాక్షిపాళ్య పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుడు నాగేశ్ ప్రస్తుతం విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఎలాంటి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి రసాయనాలతో కూడిన సీసాను స్వాధీనం చేసుకున్న పోలీసులు దాన్ని ఎఫ్ఎస్ఎల్ ప్రయోగశాలకు పంపించారు. ఆదివారం సాయంత్రం ఘటన జరిగిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తులో ఉంది.

పోలీసుల అదుపులో యువకుడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: తన వద్ద ఖరీదైన బైక్ లేదన్న కోపంతో మూడు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టాడనే ఆరోపణలపై మహాలక్ష్మీ లేఅవుట్ నివాసి పులకిత్‌ను పీణ్యా పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 19న హెచ్ఎంటీ లేఅవుట్‌లోని ఓపీజీ ముందు నిలిపి ఉన్న మూడు వాహనాలపై పులకిత్ పెట్రోల్ చల్లి నిప్పు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. బాధిత విద్యార్థి దీపాంశు అగర్వాల్ ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

టమాటా విపణిలో మంటలు

కోలారు, న్యూస్‌టుడే: కోలారులోని టమాటా మార్కెట్ యార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో వెయ్యికి పైగా క్రేట్‌లు దగ్ధమయ్యాయి. సోమణ్ణ అనే వ్యక్తికి చెందిన మండీలో రాజుకున్న మంటలను గుర్తించడంలో ఆలస్యమైంది. సమాచారం అందుకొని రెండు వాహనాల్లో వచ్చిన అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలను గుర్తించాల్సి ఉందని కోలారు ఠాణా పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

ఉడుపి, న్యూస్‌టుడే: దొడ్డణగుడ్డె బబ్బుస్వామి ఆలయ సమీపంలోని ధన్వంతరి ఆయుర్వేద ఆసుపత్రిలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దాని లోపల పనులు చేస్తున్న ముగ్గురు కార్మికులు బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆసుపత్రిలో నవీకరణ పనులు జరుగుతుండడంతో రోగులు లేరని పోలీసులు తెలిపారు. రెండు వాహనాలతో వచ్చిన అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఉడుపి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శ్రీగంధం చెట్టు నరికివేత

కలబురగి, న్యూస్‌టుడే: డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం సమీప కూడలిలో ఏపుగా పెరిగిన శ్రీగంధం చెట్టును దుండగులు ఆదివారం అర్ధరాత్రి నరికేసి తీసుకెళ్లారు. భీమనగర నివాసి సందీప్ భరణి ఇచ్చిన ఫిర్యాదుతో బ్రహ్మపుర ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కూడలి చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

'శివమొగ్గ'కు రెక్కలొచ్చాయ్ !

శివమొగ్గ, న్యూస్‌టుడే : శివమొగ్గ విమానాశ్రయం నుంచి హైదరాబాద్, చెన్నైకు వెళ్లేందుకు విమానాలు అందుబాటులోకి వస్తున్నాయని లోక్‌సభ సభ్యుడు బీవై రాఘవేంద్ర వెల్లడించారు. అక్టోబరు 10 నుంచి స్పైస్ జెట్ వస్తుందని తెలిపారు. నిత్యం ఉదయం 10.40కి చెన్నైలో బయలుదేరే విమానం 12.10కి శివమొగ్గకు చేరుకుంటుంది. శివమొగ్గ నుంచి 12.35కు బయలుదేరే విమానం 2.05కు చెన్నైకి చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 2.40కి బయలుదేరే విమానం 4.10కి శివమొగ్గకు విమానం చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.25కి బయలుదేరే ఆ విమానం 5.55కి తిరిగి గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఈ విమాన సేవలతో శివమొగ్గ జిల్లాలో వ్యాపార, పర్యాటక రంగాలకు ఉత్తేజం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సింధనూరు లయన్స్ ప్రతినిధుల ఔదార్యం


ఉర్దూ పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లు, అందిస్తున్న లయన్స్ ప్రతినిధులు

సింధనూరు, న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ సేవలకు కులమత భేదాలు లేవని.. మాకు అందరూ సమానమే, ఎక్కడ అవసరమున్నా అక్కడ మేం ఉంటామని సింధనూరు సీనియర్ లయన్ ఎన్.వి.సత్యనారాయణ అన్నారు. సింధనూరు లతయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోనుగుంట్ల రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జనతా కాలనీలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పిల్లల ఆసనాలు, టేబుళ్లు, పుస్తకాల సంచులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు రవీంద్ర లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధులు శివరామకృష్ణ, వెంకటేశ్ గూడపాటి, ప్రకాశ్, పద్మనాయుడు పాల్గొన్నారు.

రహదారి భద్రతకు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి సిద్ధు వెల్లడి



సదస్సు ప్రారంభ కార్యక్రమంలో సిద్ధరామయ్య తదితరులు


జాగృతి ప్రదర్శనలో బాలలతో డీకే శివకుమార్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : రహదారి సురక్షతకు ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పిలుపునిచ్చారు. 'మన రహదారులు- బాధ్యత' పేరిట సొసైటీ ఫర్ ఆటోమోటివ్ ఫిట్‌నెస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ మంగళవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన వార్షిక సదస్సును ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగో అతి పెద్ద వాహన పరిశ్రమగా భారత్ ఎదిగిందని గుర్తు చేశారు. ఇది స్థూల జాతీయోత్పత్తిలో 6.5 శాతం వాటాతో 30 మిలియన్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. గత ఏడాది భారత్‌లో 1.68 లక్షల ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. ఈ ప్రమాదాలతో లెక్కలేనన్ని కుటుంబాలకు తీరని శోకం మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి భద్రత కేవలం ఆర్థిక సమస్య కాదని, జీవనస్థాయికి సంబంధించిన అంశమని విశ్లేషించారు. కర్ణాటకలో రహదారి భద్రతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రమాదాలను అరికట్టే దిశలో మౌలిక సదుపాయాల వృద్ధి, అధునాతన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 'బ్లాక్ స్పాట్'లను గుర్తించి, అక్కడ అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. స్మార్ట్ ట్రాఫిక్ వ్యవస్థతో ప్రమాదాలు నిలువరించగలిగామని, మోటారు వాహనాల చట్టాల ఉల్లంఘన తగ్గుముఖం పట్టిందన్నారు. అధిక వేగం, మద్యం తాగి వాహనాలు నడపడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించామన్నారు. రహదారి భద్రత, సురక్షత సంబంధించిన అంశాలతో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యుత్తు వాహనాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. బెంగళూరును హరిత నగరంగా మార్చేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వచ్చే రెండేళ్లలో ఐదు వేల విద్యుత్తు బస్సులను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ అభివృద్ధిలో కర్ణాటక మోడల్ రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి శివకుమార్ బ్యాటరీ ఆటోను నడిపి సంతృప్తి వ్యక్తం చేశారు. రహదారి సురక్షతకు సంబంధించి విద్యార్థులు ఇచ్చిన మూకాభినయ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

చివరి ఆయకట్టుకు నీరివ్వకపోతే ఉపేక్షించం


పాత్రికేయులకు వివరిస్తున్న చామరస్

రాయచూరు, న్యూస్‌టుడే : తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టు ప్రాంతానికి సాగునీటిని సక్రమంగా సరఫరా చేయించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కలబురగి విభాగం కమిషనర్‌ను ఆదేశించారని, ఒక వేళ నీరివ్వకపోతే జిల్లా పర్యటనకు సీఎం, డిప్యూటీ సీఎం వస్తే తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తామని' రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చామరస్ మాలిపాటిల్ హెచ్చరించారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22 తుంగభద్ర జలాశయం వద్ద సిద్ధరామయ్యను కలసి చివరి రైతులకు ఏటా కనీసం ఒక పంటకు కూడా నీరు అందక నష్టపోతున్న విషయాన్ని ఏకరవు పెట్టగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ విషయమై మంత్రులు శరణ ప్రకాష్ పాటిల్, బోసురాజును మందలించినట్లు చెప్పారు. కొప్పళ జిల్లా బాధ్యమంత్రి శివరాజ్ తంగడగి వల్లనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రులు చెప్పగా చివరి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని ఆయనకు గట్టిగా చెప్పారన్నారు. జలవనరుల శాఖ మంత్రి డి.కె.శివకుమార్ బాధ్యతా రహితంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వాల్సిన మంత్రి నీటి కోసం రాస్తారోకో చేస్తే నీటి చోరులు ఎవరో బయటపడతారని వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఎడమ కాలువ, నారాయణపుర కుడి కాలువ పరిధిలో సిబ్బంది కొరత, కాలువల్లో పిచ్చి మొక్కలు తొలగించకపోవడం చేయకపోవటం, నీటి నిర్వహణ, పంపుసెట్ల ద్వారా నీటి చౌర్యంపై చర్చించేందుకు ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులతో సమావేశం జరపాలని సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ పాటిల్, ప్రతినిధులు దేవరాజ్ నాయక్, బూదయ్యస్వామి, మల్లన్న దిన్ని, అమరణ్ణ గుడిపాల్గొన్నారు.

సామాజిక సేవల్లో 'నవోదయ' ముందంజ


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధనకుమారి

రాయచూరు, న్యూస్‌టుడే : సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో నవోదయ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ముందంజలో ఉన్నారని నవోదయ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుధన కుమారి పేర్కొన్నారు. మంగళవారం ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పతాక దినోత్సవాన్ని ఆచరించారు. ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ కౌశిక్‌రెడ్డి పతాకావిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధనకుమారి మాట్లాడుతూ ఆరోగ్య రక్షణ, శిబిరాలు వైద్య చైతన్య కార్యక్రమాలు, రక్తదానం, ఆరోగ్య శిబిరాలు తరచూ నిర్వహిస్తూ పేద ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారన్నారు. గ్రామీణులకు మెరుగైన వైద్యం దక్కాలని నవోదయ వైద్య కళాశాల, ప్రభుత్వ లక్ష్యాలను అమలు చేయడంలో విజయవంతం అవుతున్నారని అభినందించారు. అధ్యక్షత వహించిన ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దొడ్డయ్య మాట్లాడుతూ 13 ఏళ్లుగా స్వచ్ఛంద సేవకులైన విద్యార్థులు సంతృప్తికరమైన రీతిలో జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవలందిందిస్తున్నట్లు వివరించారు. వీటి వల్ల విద్యార్థులకు గ్రామీణ జీవన శైలిపై అవగాహన కల్గుతోందని, నాయకత్వ లక్షణాలు పెంపొందాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి నరసింహాచార్ జోషి, ప్రముఖులు అనికేత్ దాస్, దీపాలి పాటిల్, రోహిత్ భండారి పాల్గొన్నారు.

విదేశీ పర్యటన విజయవంతం కావాలి


వాణిజ్యోద్యమ సంఘం ప్రతినిధులతో జిల్లాధికారి నితీశ్

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించేందుకు ఐదు రోజుల మలేషియా పర్యటనకు వెళుతున్న రాయచూరు వాణిజ్యోద్యమ సంఘం ప్రతినిధులను జిల్లా పాలనాధికారి కార్యాలయం ఆవరణలో మంగళవారం జిల్లా పాలనాధికారి నితీశ్ సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పేలా ఆకర్షించాలని కోరారు. లభ్యత భూమి, నీటి వనరులు, విద్యుత్తు, కార్మికుల కొరత లేదని, ప్రభుత్వ రాయితీల గురించి అక్కడి పారిశ్రామికవేత్తలకు క్షుణంగా తెలియజేయాలని కోరారు. వెల్లువలా పరిశ్రమలు స్థాపిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని, జిల్లా ఆర్థికాభివృద్ధి చెందుతుందని చెప్పారు. బెంగళూరు, మంగళూరు, ఉడుపి, కేరళ తదితర ప్రాంతాలకు వలసల వెళుతున్న కార్మికులు, కూలీలకు ఇక్కడే పని దొరుకుతుందన్నారు. ఇతర జిల్లాలకు ఆదర్శంగా పరిశ్రమలు స్థాపించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త నిర్దేశకుడు బసవరాజ్ యంకంచి, వాణిజ్యోద్యమ సంఘం అధ్యక్షుడు కమలకుమార్, ప్రతినిధులు వి.లక్ష్మిరెడ్డి, లక్ష్మీపతి, త్రివిక్రమజోషి, జంబణ్ణ పాల్గొన్నారు.

సమస్యలపై మాజీ దేవదాసీల ఆందోళన


నినాదాలు చేస్తున్న మహిళలు

రాయచూరు, న్యూస్‌టుడే : మాజీ దేవదాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 'దేవదాసీ మహిళల విమోచన సంఘం' ఆధ్వర్యంలో మంగళవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు హెచ్.పద్మ మాట్లాడుతూ మూడు నెలలుగా పింఛన్ రాకపోవడంతో ఇల్లు గడవటం కష్టంగా ఉందని వాపోయారు. గత బడ్జెట్‌లో పెంచిన రూ.500ను కలుపుకొని నెలకు రూ.2 వేల చొప్పున రూ.6 వేల పింఛన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ దేవదాసీ మహిళల జనాభాను గుర్తించేందుకు మళ్లీ సమీక్ష చేయాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సర్వేకు ఆదేశించాలని కోరారు. వివిధ సౌలభ్యాలు పొందేందుకు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి దరఖాస్తులు స్వీకరించే విధానాన్ని ప్రారంభించాలన్నారు. రాయచూరులో పునర్వసతి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని, లింగసూగూరు తాలూకా ముదగల్‌లోని 15 మంది మాజీ దేవదాసీలకు వసతి కోసం స్థలాన్ని మంజూరు చేయాలని జిల్లా పాలనాధికారికి విజ్ఞప్తి చేశారు. ఆందోళనకు జిల్లా గౌరవాధ్యక్షుడు కె.జి.వీరేశ్, తాలూకా అధ్యక్షురాలు జమలమ్మ, కార్యదర్శి మంజుల మహాదేవి, ప్రతినిధులు సరోజమ్మ, మరియమ్మ, మౌనమ్మ నేతృత్వం వహించారు.

షాదీమహల్లో సీరత్

మాన్వి, న్యూస్‌టుడే : అన్ని ధర్మాల సారాంశం ఒక్కటేనని, అది శాంతి మంత్రమని కరేగుడ్డ మహాంతేశ్వర మఠం మహాంతలింగ స్వామీజీ పేర్కొన్నారు. స్థానిక జమావే ఇస్లామీ హింద్ తాలూకా శాఖ ఆధ్వర్యంలో ఈద్గా షాదీమహల్లో సీరత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆయన సాన్నిధ్యం వహించి మాట్లాడారు. లాల్ హుసేన్ కందకల్ ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ముఫ్తీ సయ్యద్ హసన్ జీశాన్ ఖాద్రి ఖాస్మీ, వలయ సంచాలకుడు మౌలానా అన్వర్ పాషా ఉమ్రి, శంకరయ్యస్వామి సువర్ణగిరిమఠ, ఫాదర్ విన్సెంట్ సురేష్ మాట్లాడారు. సయ్యద్ అక్బర్ పాషాసాబ్, షేక్ ఫరీద్ ఉమ్రి, అబ్దుల్ ఖరీం, ఖాన్‌సాబ్, సమీర్ పాషా, నాసిర్ అలి, జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, మౌలానా అబులాల్, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహాంతలింగ స్వామీజీ

కలుషిత ఆహారం తిని అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

సిరివార, (మాన్వి) : ఇక్కడికి సమీపంలోని ఆల్కోడు గ్రామంలోని కస్తూరిబా వసతి పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం జరిగింది. ఉదయం ఉపహారంగా చిత్రాన్నం తిన్న కొద్ది సేపటికే బాలికలు ఇబ్బంది పడ్డారు. అస్వస్థతకు లోనైన వారిని సమీపంలోని అరకెరా ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్సలు చేశారు. కలుషిత ఆహారం కారణంగా ఇలా జరిగినట్లు గుర్తించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొంత మంది విద్యార్థినులను దేవదుర్గ ఆసుపత్రికి తరలించారు. అందరూ కోలుకుంటున్నారని.. భయపడాల్సిన పనిలేదని డాక్టర్ రాఘవేంద్ర తెలిపారు. నెల రోజుల క్రితం ఇదే విధంగా జరిగిందని, దీనిపై విచారించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వసతి నిలయం వార్డెన్, ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చారిత్రక కట్టడాలను కాపాడుకుందాం

రాయచూరు, న్యూస్‌టుడే : కోటలు, చారిత్రక కట్టడాలు, స్మారకాల రక్షణకు ప్రజల భాగస్వామం అవసరమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్రం అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సంతోషకుమార్ రేవూరి పేర్కొన్నారు. పురాతన సంపదను రాబోవు తరాల కోసం, వాటి మనుగడ కోల్పోకుండా చూసుకోవడం బాధ్యతగా భావించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు మంగళవారం రాయచూరు తాలూకా మలియాబాద్‌లోని రామలింగేశ్వర దేవస్థానం, గోశాల్ ఆవరణలో స్వచ్ఛతా పనులు చేశారు. ప్రజలు తమతో చేతులు కలపాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛంద సేవకులు మైత్రి, సంగీతా, శారదా, శోభా, గీతా, చైత్ర, తాయమ్మ, అనితా, తారేషా, దేవమ్మ, తాయయ్మ, ఐశ్వర్య శ్రమదానం చేశారు.

సిద్ధూ రాజీనామాకు డిమాండ్


ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాయచూరు, న్యూస్‌టుడే : ముడా కేసులో అర్జీని ఉన్నత న్యాయస్థానం తిరస్కరించిన నేపథ్యంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని జిల్లా భాజపా డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సీనియర్ నాయకుడు ఎన్.శంకరప్ప నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ కూడలి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరప్ప మాట్లాడుతూ కోర్టులో చుక్కెదురైనా పదవిని వీడనని ప్రకటించిన సిద్ధరామయ్యను చూసి ప్రజలు నివ్వెరపోతున్నారన్నారు. గతంలో గవర్నర్ విచారణకు ఆదేశించిన వెంటనే యడియూరప్ప పదవిని వదులుకున్నట్లు తెలిపారు. సిద్ధూ రాజీనామా చేసి న్యాయస్థానాన్ని గౌరవించాలని సలహా ఇచ్చారు. పార్టీ మీడియా బాధ్యుడు వి.పి.రెడ్డి, నాయకులు పలుగుల నాగరాజ్, రామచంద్ర కడుగోలు, వినాయక్, కె.ఎం.పాటిల్, శంకరరెడ్డి, శశిరాజ్, రాజకుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవకు దక్కిన గుర్తింపు


ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న మంత్రి సుధాకర్, ఉపకులపతి, తదితరులు

హుబ్బళ్లి, (మాన్వి) : కర్ణాటక విశ్వవిద్యాలయం ధారవాడ ఘటికోత్సవ సందర్భంగా మంగళవారం హుబ్బళ్లి కమ్మవారి సంఘం ప్రముఖుడు, సమాజ సేవకుడు, స్వర్ణగ్రూప్ అధినేత సి.హెచ్.వి.ఎస్.వి.ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన సమాజ సేవలను గుర్తించి ఎంపిక చేసినట్లు ఉప కులపతి కె.జి.గుడిసి వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్, ఉప కులపతి చేతుల మీదుగా ప్రసాద్ డాక్టరేట్ అందుకున్నారు. ఆయనతో బాటు ఆక్స్‌ఫర్డ్ సంస్థ నిర్వాహకులు వెంకటలక్ష్మీ నరసింహరాజు డాక్టరేట్ స్వీకరించారు. తెలుగువారు డాక్టరేట్లు అందుకోవటంపై తెలుగు సంఘ సంస్థల ప్రముఖుల హర్షం వ్యక్తం చేశారు.

28న ముస్లిం సంఘాల సమావేశం

మాన్వి, న్యూస్‌టుడే : ఈ నెల 28న కల్యాణ కర్ణాటకలో బీదర్ నుంచి బళ్లారి, హైదరాబాద్, ఆదోని, కర్నూలు ముస్లిం సంఘాల ప్రాంతీయ ధార్మిక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాన సంచాలకుడు ఖాలిద్ ఖాద్రి గురు వెల్లడించారు. మంగళవారం ఆయన వివిధ ముస్లిం సంఘాల ప్రముఖులు, మత పెద్దలతో కలిసి ఖాద్రి ఫంక్షన్ హాల్లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్రకు ఖాద్రి సాహెబ్ అధ్యక్షత వహిస్తారని, హైదరాబాద్ అరబిక్ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు మౌలానా ఉబేదుల్లా, ఉత్తరప్రదేశ్ విశ్వవిద్యాలయం ఉప కులపతి మౌలానా ముఫ్తీ సల్మాన్, బెంగళూరుకు చెందిన మౌలానా మక్సూద్ ఇమ్రాన్, ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ గఫార్, ధార్మిక గురువులు, మత పెద్దలు సమావేశానికి హాజరవుతున్నట్లు వివరించారు. మూడు రాష్ట్రాల నుంచి 20 వేల మంది పాల్గొంటారన్నారు. హసన్ జీశాన్, సజ్జద్ మత్వాలే గురు, అక్బర్‌సాబ్, అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ కరీంఖాన్, యూసుఫ్‌ఖాన్, మహ్మద్ హుసేన్, షబ్బీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సింధనూరు-రాయచూరు మార్గం విస్తరణ


పీడబ్ల్యూడీ క్యాంపు 30వ వార్డులో జనం సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్యే బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు - రాయచూరు మధ్య గల 90 కిలోమీటర్ల రహదారికి మోక్షం లభించనుంది. ఈ నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి వచ్చే నెల నాలుగున రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాదర్లి హంపన గౌడ మంగళవారం పాత్రికేయులకు వెల్లడించారు. నాలుగున 'సింధనూరు దసరా' ఉత్సవాన్ని ప్రారంభించడానికి సింధనూరు విచ్చేయనున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ప్రాంతం ప్రజలకు మేలు చేసే మొత్తం రూ.1800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని బాదర్లి వెల్లడించారు. తాలూకాలోని గొరేబాళ క్యాంపు - గాంధీనగర్ మధ్య రూ.20 కోట్లతో గ్రామీణ రహదారి నిర్మాణానికి కూడా అదే రోజున సీఎం భూమి పూజ చేస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే పీడబ్ల్యూడీ క్యాంపులోని 30వ వార్డుకు వెళ్లి అక్కడి ప్రజలతో సమావేశమయ్యారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యలు వినిపించారు. తాగునీటి ఇబ్బందులు, వీధుల్లో దారుల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అంచెలంచెలుగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. నగరసభ కమిషనర్ మంజునాథ్ గుండూరు ఆయన వెంట ఉన్నారు.

దేవదుర్గలో జానపద సాహిత్య సమ్మేళనం


పాత్రికేయులతో మాట్లాడుతున్న శరణప్ప

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా జానపద సాహిత్య పరిషత్ రెండో సమ్మేళనాన్ని నవంబరు తొలి వారంలో దేవదుర్గలో నిర్వహిస్తామని జానపద పరిషత్ జిల్లా అధ్యక్షుడు శరణప్ప అనెహోసూరు వెల్లడించారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమ్మేళన నిర్వహణ ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలిపారు. స్మరణ సంచికలో లేఖలను ప్రచురించేందుకు జానపద కవులు, కళాకారుల నుంచి లేఖలు ఆహ్వానిస్తున్నామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పురస్కారాలు పొందిన లేఖలను పంపాలని కోరారు. ఆసక్తి గల వారు అక్టోబరు 15 లోపు janapadraichur@gmail.com, anehosurpv@gmail.com కు పంపుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం దేవదుర్గ తాలూకా, లేక జిల్లా పరిషత్ ప్రతినిధులను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ప్రతినిధులు డాక్టర్ అరుణా హీరేమఠ, విద్య, బసవరాజ్, విజయ రాజేంద్ర పాల్గొన్నారు.

సహకార సంఘం సేవలు విస్తృతం



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సురేష్‌గౌడ, తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే : మాన్వి పట్టణానికి పరిమితమైన శారదాంబ సహకార సంఘం సేవలను కల్యాణ కర్ణాటక మొత్తం విస్తరించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సురేష్‌గౌడ తెలిపారు. మంగళవారం బ్యాంక్ కార్యాలయంలో నిర్వహించిన సంఘం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం రూ.11 లక్షల పెట్టుబడితో సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.33.56 కోట్లు లావాదేవీలు సాగించిందన్నారు. వేసవిలో తాలూకాలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు శుద్ధ జలకేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సీఈఓ రాజ్‌కుమార్, మేనేజర్ విజయకుమార్, ఉపాధ్యక్షుడు సురేష్ సంగాపూర్, బ్యాంక్ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

దసరాకు సెలవులివిగో !

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : దసరా పండగను పురస్కరించుకుని అక్టోబరు మూడో తేదీ నుంచి 20 వరకు పాఠశాల విద్యార్థులకు సెలవు ఇస్తున్నామని విద్యాశాఖ ప్రకటించింది. అన్ని జిల్లాల్లోని- అన్ని రకాల పాఠశాలలకు ఏకరూప సెలవులు వర్తిస్తాయని సంబంధిత అధికారులు తెలిపారు. విద్యాలయాల నిర్వాహకులు ఈ ఉత్వర్వులు అనుసరించాలని స్పష్టం చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.94	1619.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,980	3,455
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,153	9,885
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.539	60.905

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

రహదారుల నిర్మాణాలకు భూమిపూజ


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్

మాన్వి, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. సిరివార తాలూకా నుగడోణిలో కర్ణాటక ప్రదేశాభివృద్ధి మండలి నిధులతో రహదారి నిర్మాణానికి, మాన్వి పట్టణంలోని కరిడిగుడ్డ రోడ్డు జెమినివాటర్ ఏరియాలో రూ.50 లక్షలతో చేపట్టనున్న రహదారి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఈ రోడ్ల నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. గుత్తేదారులు పనులు సవ్యంగా చేయాలని, అధికారులు సక్రమంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజాపనుల శాఖ అధికారులు శ్యామలప్ప, వీరభద్రప్ప, సత్యనారాయణరెడ్డి, మక్బూద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ గఫూర్, రామకృష్ణ, వీరేశ్, నాగరాజ్, రవికుమార్, ప్రవీణ్‌కుమార్, పురపాలక సంఘం సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27న గణేష్ నిమజ్జన శోభాయాత్ర


పాత్రికేయులతో మాట్లాడుతున్న రవి కుమార్

రాయచూరు, న్యూస్‌టుడే : ఈ నెల 27న పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రను వైభవంగా నిర్వహిస్తామని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ వెల్లడించారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు గుజరాత్ కల్యాణ మండపం వద్ద యాత్ర ప్రారంభమవుతుందని, పటేల్ రహదారి, తీనకందిల్ ద్వారా ఖాసబావి వరకు ఊరేగింపుగా వెళ్లి అందులో నిమజ్జనం చేస్తామన్నారు. యాత్రలో పదివేల మంది పాల్గొంటారని అంచనా వేసినట్లు చెప్పారు. ఆయన మంగళవారం పత్రికా భవన్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. హిందూ మహాగణపతి ఉత్సవ సమితి రాయచూరులో తొలిసారిగా ప్రతిష్ఠించినట్లు తెలిపారు. విగ్రహానికి 21 రోజులు పూజలు, సాయంత్రం వేళ మహా మంగళహారతి పట్టారని చెప్పారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రతినిధులు సునీల్ కుమార్, గౌతమ్ జైన్, రవి కృష్ణ, శరణబసవ, చంద్రశేఖర్, సాయిరామరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.